


**క్యాన్సర్ స్క్రీనింగ్ మొబైల్ వాహనాలు** 2లో

APTEL 2009/31957

# నీలగిరి వార్త

మన కోసం మన వార్త తెలుగు దినపత్రిక

neelagirivartha@gmail.com

ఏపీ & తెలంగాణ | మంగళవారం | 31 మార్చి 2026 | సంపుటి : 17 | సంచిక : 203 | పేజీలు : 12 | వెల : 5/-

**రిపోర్టర్లు కావలెను**

తెలంగాణ, ఏపీ వ్యాప్తంగా 'నీలగిరి వార్త' దినపత్రికలో పనిచేయడానికి రిపోర్టర్లు కావలెను. వివరాలకు

**96765 49223**

నంబర్‌లో సంప్రదించగలరు.

-ఎడిటర్



## ఇరాన్ దిగిరాకపోతే స్మాష్ చేస్తాం

- త్వరగా ఒప్పందం కుదుర్చుకుని దారికి రావాలి
- మరోమారు తీవ్ర హెచ్చరిక చేసిన ట్రంప్

2లో



## లాకర్ వస్తువులకు బీమా వర్తించదు

- అందులో ఏం దాచారో బ్యాంకులు చూడవు
- లోక్‌సభలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

2లో



## ఉద్యమకారులు లేకుంటే మనమంతా లేనట్లే

- సిఎం, మంత్రులు కూడా ఉండేవారా?
- వారికిచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి
- మండలిలో విజయశాంతి సంచలన వ్యాఖ్యలు

2లో

# మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయండి

- గవర్నర్ శుక్లాకు బీఆర్ఎస్ నేతలు వినతి
- మైనింగ్‌లో అక్రమాలకు పాల్పడ్డారని ఫిర్యాదు
- ప్రభుత్వం తీరుపై మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలు
- స్వతంత్ర విచారణకు గవర్నర్ ఆదేశించినట్లు వెల్లడి
- ప్రతిపక్షాలను బెదిరించే ప్రయత్నిస్తున్నదని ధ్వజం
- హౌజ్‌కమిటీ వేసి విచారణ జరపాల్సిందే
- శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి



**హైదరాబాద్, నీలగిరివార్త :** ప్రతిపక్షాన్ని సీఎం రేవంత్‌రెడ్డి బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అంశంలో సభా సంఘం వేయాలని కోరితే సీఐడీని అడ్డుపెట్టుకుని మంత్రి పొంగులేటిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పార్టీ నేతలతో కలిసి లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కేటీఆర్ కలిశారు. ఈ సందర్భంగా పొంగులేటిపై ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ పెద్దలే గద్దలుగా మారి అవినీతికి పాల్పడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. ఈ అంశంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని.. స్వతంత్ర విచారణకు ఆదేశించాలని కోరినట్లు చెప్పారు. మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలని గవర్నర్‌ను కోరామన్నారు. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు భేటీ అయ్యారు. లోక్ భవన్‌కు వెళ్లిన బీఆర్ఎస్ బృందం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మైనింగ్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని గవర్నర్‌కు వినతి పత్రం అందజేశారు. హైకోర్టు జడ్జితో విచారణ చేయించాలని విజ్ఞప్తి చేశారు. వేల కోట్ల ప్రజా సంపదను మంత్రి పొంగులేటి అక్రమ మైనింగ్ ద్వారా కొల్లగొడుతున్నారని బీఆర్ఎస్ శాసన సభా పక్ష బృందం ఆరోపించింది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీష్ రావు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఆదివారం కూడా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మైనింగ్ వ్యవహారంపై అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. మంత్రి పొంగులేటి రాఘవ కన్ స్ట్రక్షన్ ద్వారా అక్రమ మైనింగ్‌కు పాల్పడుతూ ప్రభుత్వానికి ఆదాయానికి గండి కొడుతున్నారని బీఆర్ఎస్ ఆరోపించింది. రాఘవ

మిగతా 2వ పేజీలో...




## ముంచుకొస్తున్న మంచినీటి సమస్య !

- కోటి ఎకరాల భూ ఆక్రమణకు టెండర్
- ముఖ్యమంత్రి, మంత్రుల భూ దందాకు సామాన్యుల బలి
- వట్టినాగులపల్లిలో బాధితులకు కెటిఆర్ పరామర్శ

2లో

# ఇందిరాగాంధీ వల్లే దేశంలో నక్సలిజం

- ప్రజలను చంపేవారు దేశభక్తులు ఎలా అవుతారు
- సమాంతర ప్రభుత్వాలు నడిపిన మావోయిస్టులు
- చర్చల ద్వారా సమస్యలు పరిష్కారం
- నక్సల్స్‌పై హోంమంత్రి అమిత్ షా ప్రకటన



**న్యూఢిల్లీ, నీలగిరివార్త :** చర్చల ద్వారానే ఏ సమస్యకైనా పరిష్కారం సాధ్యమని.. తుపాకులతో కాదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. ప్రజలను చంపేవారు దేశభక్తులు ఎలా అవుతారని ప్రశ్నించారు. నక్సలైట్లు తమ సిద్ధాంతాన్ని కూడా విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నారు' అని అమిత్ షా తెలిపారు. నక్సలైట్లకు ఆదర్శం భారతీయులెవరూ కాదు.. వారికి మావో ఆదర్శమని అమిత్ షా పేర్కొన్నారు. పార్లమెంట్‌లో ఆయన మాట్లాడుతూ మాట్లాడితే ప్రజాస్వామ్యం అంటారు కానీ హింసను ఎలా సమర్థిస్తారని ప్రశ్నించారు. కాంబోడియా, పెరూ, కొలంబియాలో భయంకర రక్తపాతం జరిగిందని పేర్కొన్నారు. దేశాభివృద్ధికి మావోయిస్టు సిద్ధాంతాలు, విధానాలు తీవ్ర ఆటంకం అన్నారు. మావోయిస్టుల రక్తపాత సిద్ధాంతాన్ని ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారు. బస్తర్‌లో నక్సల్స్ అనేక ఏళ్లపాటు సమాంతర ప్రభుత్వం నడిపారు. ఆయుధాలు వీడాలని బస్తర్ వెళ్లి పలుసార్లు కోరాం' అని అన్నారు. నక్సలిజం నశించాలని గిరిజనులు

మిగతా 2వ పేజీలో...

# పెరంబూర్ నుంచి విజయ్ నామినేషన్

- భారీగా తరలివచ్చిన అభిమానులు
- డిఎంకె పాలనలో ప్రజలకు రక్షణ లేదని విమర్శలు
- 404 కోట్ల స్థిరచరాస్థులు ఉన్నట్లు అఫిడవిట్ దాఖలు




**చెన్నై :** తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ పెరంబూర్ నియోజకవర్గం నుంచి పోటీకి సోమవారంనాడు నామినేషన్ వేశారు. తూర్పు తిరుచ్చి నుంచి కూడా ఆయన పోటీలో ఉన్నారు. పెరంబూర్‌లో నామినేషన్ వేసేందుకు వచ్చిన విజయ్‌ను చూసేందుకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున అక్కడకు వచ్చారు. నామినేషన్ అనంతరం పెరంబూర్‌లో ఓపెన్ టాప్ వాహనంలో ప్రచారం సాగించారు. డీఎంకే ఒక దుష్టశక్తి అని మరోసారి విజయ్ విమర్శించారు. డీఎంకే హయాంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, మాదకద్రవ్యాల బెడద ఉందన్నారు. ఈ దుస్థితికి దుష్టశక్తి డీఎంకే, స్టాలిన్ కారణమని విమర్శించారు. తమిళనాడును తాము కాపాడతామని, సాఫీగా తన జీవితం సాగు తున్నప్పటికీ ప్రజల కోసం రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజాసేవతో వారి రుణం తీర్చుకుంటున్నానని చెప్పారు. ప్రజలకు తాను

మిగతా 2వ పేజీలో...

# అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లు

- సెలెక్ట్ కమిటీకి పంపిన స్పీకర్
- బిల్లును వ్యతిరేకించిన బిజెపి
- మధ్యప్రాచ్యంలో యుద్ధాన్ని ఆపండి
- పారాక్వాట్ గడ్డి మందును నిషేధించాలి
- తీర్మానం ఆమోదించిన అసెంబ్లీ



**హైదరాబాద్, నీలగిరివార్త :** తెలంగాణ అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. స్పీకర్ ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి సిఫార్సు చేశారు. ఈ బిల్లును గత సోమవారం రాష్ట్ర మంత్రిమండలి ఆమోదించింది. ఈ బిల్లుతో ఇక విద్వేష పూరిత ప్రసంగాలకు చెక్ పడనుంది. మతం,కులం, లింగం లేదా ఇతర కారణాల వల్ల సమాజంలో విద్వేషం, అశాంతిని రేకెత్తించే ప్రసంగాలు, రచనలు లేదా సోషల్ మీడియా పోస్టు లను అరికట్టడానికి ఉద్దేశించిన చట్టమే హేట్ స్పీచ్ బిల్లు. ఇటువంటి చర్యలకు పాల్పడేవారిపై కఠినమైన జరిమానాలు, 7 ఏళ్ల వరకు జైలు శిక్ష విధించడం, ఈ నేరాలను నాన్-బెయిలబుల్‌గా పరిగణించడం దీని ముఖ్య ఉద్దేశ్యం. విద్వేష పూరిత ప్రసంగాలు

మిగతా 2వ పేజీలో...



## పౌర స్వేచ్ఛను హరించే బిల్లు

- ఇదొక క్రూరమైన ఆయుధం
- విమర్శకుల నోళ్లు మూయించే కుట్ర
- హేట్ స్పీచ్ బిల్లుపై కెటిఆర్ విమర్శలు


2లో



## చైనా సిసి కెమెరాలపై బ్యాన్

- దిగుమతికి బ్యాక్ డోర్ ఉంటుందన్న అనుమానం
- కొత్త నిబంధనలు తీసుకొచ్చిన కేంద్రం

2లో



## 30వేలకు ఎస్సై కక్కుర్తి

- ఏసీబీకి అడ్డంగా బుక్కు
- నాగర్‌కర్నూల్ జిల్లాలో వెలుగు
- జేసీబీ రిలీజ్‌కు డబ్బు డిమాండ్

2లో

# ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థ

- ఈగల్, హైడ్రా తరహాలో ఏర్పాటు ఆలోచన
- నిత్యావసరాలు అక్రమ నిల్వ చేస్తే కఠిన చర్యలు
- సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ తగ్గింది
- వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం
- త్వరలో ప్రజలకు క్యాన్సర్ టెస్టులు
- 50 శాతం సీట్లు పెంపు వెనక కుట్ర
- దక్షిణ భారత దేశానికి తీవ్ర అన్యాయం చేసే ఎత్తుగడ
- కెసిఆర్ వల్లనే తనకు మంచి పేరు వస్తోంది
- మీడియా చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి




**హైదరాబాద్, నీలగిరివార్త :** ఈగల్, హైడ్రా తరహాలో ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థను తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామన్నారు. మరోవైపు పంటకు ధర నిర్ణయించే అవకాశం రైతుకు లేకుండా పోయిందని, వారి అవసరాలను ఆసరాగా చేసుకొని దళారులు దోపిడీ చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు. రైతుల హక్కులను కాపాడేందుకు కనీస మద్దతు ధర చట్టం తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. సోమవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే ఎక్కువే. ప్రజలకు దొడ్డుబియ్యం ఇవ్వడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించాం. 86 శాతం ప్రజలు సన్నబియ్యం పొందుతున్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డు

మిగతా 2వ పేజీలో...

# జీవో 317ను వెంటనే రద్దు చేయాలి

- వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలి
- గతంలో పిసిసి చీఫ్‌గా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి
- సిఎం రేవంత్ రెడ్డికి కల్వకుంట్ల కవిత బహిరంగ లేఖ

**హైదరాబాద్, నీలగిరివార్త :** జీవో నం.317 బాధితులకు వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కవిత బహిరంగ లేఖ రాశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021 డిసెంబర్ 6న జారీ చేసిన జీవో నం.317 వల్ల వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. జీవో 317ను వెంటనే రద్దు చేసి ఉద్యోగులకు సొంత జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు సీఎం రేవంత్ రెడ్డి కూడా ఈ అంశంపై అప్పటి సీఎం కేసీఆర్ లేఖ రాసిన

మిగతా 2వ పేజీలో...



# హైదరాబాద్, చెన్నై కంటే గొప్పగా అమరావతి

- యువతకు రాజకీయాల్లో ప్రవేశానికి టిడిపి అవకాశం
- పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యం
- సూల్లూరుపేటలో టిడ్కో ఇళ్లు పంపిణీ చేసిన ఏపీ సర్కార్
- ఏపీలో ఇండ్ల పండగ జరుగుతోందన్న సిఎం చంద్రబాబు




**తిరుపతి, నీలగిరివార్త :** రాజధాని అమరావతిని హైదరాబాద్, చెన్నై కంటే గొప్పగా తయారు చేసే బాధ్యత వేము తీసుకుంటాం అని సిఎం చంద్రబాబు అన్నారు. యువతకు ఇదే ఆహ్వానం. టీడీపీలోకి వస్తే అవకాశాలు కల్పిస్తాం అన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలన్నారు. వైసీపీలాంటి పనికిమాలిన ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు. ప్రజలకు కోపం రావడం వల్లే వైసీపీని 11 సీట్లకు పరిమితం చేశారని అన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేట వేదికగా 2.50 లక్షల ఇళ్లను లబ్దిదారులకు సీఎం నారా చంద్రబాబు నాయుడు పంపిణీ చేశారు. 2,50,893 పేద కుటుంబాలకు ఇళ్లను పంపిణీ చేసి వారితో గృహ ప్రవేశం చేయించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఇంత భారీ మొత్తంలో గృహ ప్రవేశాలు చేయించడం ఇది రెండో సారి. మొదటి విడత కింద

మిగతా 2వ పేజీలో...

# క్యాన్సర్ స్క్రీనింగ్ మొబైల్ వాహనాలు

## జెండా ఊపి ప్రారంభించిన గవర్నర్




**హైదరాబాద్, నీలగిరివార్త :** క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల మొబైల్ వాహన సేవలను మెదక్ ప్రజలు ఉపయోగించుకోవాలని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా కోరారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రజల సౌకర్యార్థం భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ప్రిలిమినరీ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాన్ని ఆయన లోక్‌భవన్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ వాహనంలోని సౌకర్యాలను ఎంపీ రఘునందన్ రావు గవర్నర్‌కు వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించేందుకు ఈ వాహనం ఉపయోగపడుతుందన్నారు. ఆస్పత్రిలో ఉండే స్క్రీనింగ్ సౌకర్యాలు ఇందులో ఉన్నాయన్నారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే.. తగిన చికిత్స ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చన్నారు.

# ముంచుకొస్తున్న మంచినీటి సమస్య !

- కోటి ఎకరాల భూ ఆక్రమణకు టెండర్
- ముఖ్యమంత్రి, మంత్రుల భూ దందాకు సామాన్యుల బలి
- వట్టినాగులపల్లిలో బాధితులకు కెటిఆర్ పరామర్శ
- అండగా ఉంటామని హామీ



**హైదరాబాద్, నీలగిరివార్త :**
సీఎం రేవంత్ రెడ్డి పలుకుబడిని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా భూములు గుంజుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు. భూమి బౌండరీలను మార్చే ప్రయత్నం చేశారని ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గంలో వేల ఎకరాలు కబ్జా చేస్తున్నారని తెలిపారు. అధికారులను అడ్డుపెట్టుకుని అరాచకపర్వం చేపడుతున్నారని మండిపడ్డారు. కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారని అన్నారు. రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో కేటీఆర్ సహా, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పర్యటించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భూకబ్జా బాధితులను పరామర్శించారు. భూ కబ్జాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పోరాడుతుందని బాధితులకు భరోసానిచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. వట్టనాగులపల్లిలో సతీశ్ షా కుటుంబం 60 ఏళ్లుగా ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. రూ.1400 కోట్ల విలువ చేసే భూమిపై పొంగులేటి కన్ను పడిందని పేర్కొన్నారు. స్థలం ఇచ్చే ఉద్దేశం లేదని షా కుటుంబం తెలిపిందని అన్నారు. ఔటర్ రింగ్ రోడ్డులో మీ ల్యాండ్ పోయిందని బెదిరింపులకు గురి చేశారని చెప్పారు. ఓ అక్రమార్కున్ని అడ్డం పెట్టుకుని 27 ఎకరాల భూమిని గుంజుకునే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. జేసీబీలతో వచ్చి గోశాలను కూల్చేశారని.. కాంపౌండ్ వాల్ కూలగొట్టారని అన్నారు. సతీశ్ షాను ఇక్కడే సజీవంగా పాతిపెడతామని బెదిరించారని తెలిపారు. అజీబుల్లా ఖాన్ అనే సిన్సియర్ అధికారి వీరికి రక్షణ కల్పించారని పేర్కొన్నారు. తెల్లారే ఆ నిజాయితీ పోలీసు అధికారిని ట్రాన్స్‌ఫర్ చేశారని చెప్పారు. దశాబ్దాలుగా ఇక్కడే ఉంటున్నామని వట్టినాగులపల్లి బాధితుడు సతీశ్ షా తెలిపారు. 1968 నుంచి భూములను సాగు చేసుకుంటున్నామని పేర్కొన్నారు. పొంగులేటి హర్ష రెడ్డి వచ్చి రోడ్డుకు స్థలం ఇవ్వాలని అడిగాడని చెప్పారు. అందుకు నిరాకరించడంతో కొన్ని రోజుల తర్వాత శ్రీనివాస్ రెడ్డి వచ్చారని తెలిపారు. ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా మా భూమి సర్వే చేయించాడని అన్నారు. సర్వే నోటీసులను హైకోర్టు కూడా కొట్టివేసిందని పేర్కొన్నారు. మా మనుషులపై దాడులు చేసి గూండాలు బెదిరించారని తెలిపారు. హైకోర్టుకు వెళ్తే పోలీస్ ప్రొటెక్షన్ ఇవ్వాలని ఆదేశించిందని తెలిపారు. దీపావళి పండుగ తర్వాత నుంచి చాలా ఆందోళనగా ఉన్నామని వట్టినాగులపల్లి బాధితురాలు పల్లవి షా తెలిపారు. మా భూమి ఇవ్వాలని పొంగులేటి మనుషులు కోరినా నిరాకరించామని పేర్కొన్నారు. మేం 50 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం.. మాకు వేరే జాగా వద్దని అన్నామని చెప్పారు. అక్కడిస్తాం.. ఇక్కడిస్తామని మమ్మల్ని ఎంతో మభ్యపెట్టారని తెలిపారు. కిలోమీటర్ ఉన్న కాంపౌండ్ వాల్‌ను రాత్రికి రాత్రే కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశామని తెలిపారు. అదే రోజు రాత్రి 70 మంది గూండాలు వచ్చి మా గార్డులను బంధించారని వాపోయారు. మొబైల్స్ గుంజుకున్నారు.. తెల్లవారుజాము వరకు నిర్బంధించారని తెలిపారు. ఇక్కడి నుంచి వెళ్లకపోతే నరికిపారేస్తామని బెదిరించారని అన్నారు. మాకు అండగా ఉన్న పోలీసు అధికారిని ట్రాన్స్‌ఫర్ చేయించారని తెలిపారు. మాకు అనుకూలంగా హైకోర్టు ఆదేశాలు ఉన్నా కూడా విధ్వంసానికి పాల్పడ్డారని తెలిపారు.

# మధ్యప్రాచ్యంలో యుద్ధాన్ని ఆపండి

## కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీ తీర్మానం



**హైదరాబాద్, నీలగిరివార్త :** అమెరికా, ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధాన్ని ఆపేలా కేంద్రం చొరవ చూపాలని శాసన సభ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభలో ప్రవేశపెట్టారు. మధ్యప్రాచ్యంలో యుద్ధం వల్ల దాదాపు 4 వేల మంది మరణించారని ఉపముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధ ప్రభావం ఆసియా దేశాలపై తీవ్రంగా పడుతోందని.. ఆర్థిక విధ్వంసం జరుగుతోందని తెలిపారు. యుద్ధ ప్రభావం భారత్‌పై ఎక్కువగా ఉందని భట్టి పేర్కొన్నారు. ఆయా దేశాల మధ్య ఉద్రిక్తతలు ఆగకపోతే ప్రపంచ దేశాల భవిష్యత్తు మరింత ఆందోళనకరంగా మారొచ్చని అభిప్రాయపడ్డారు. ఇది ఇప్పుడు ఆగకపోతే మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీయవచ్చని హెచ్చరించారు. అమెరికా, ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధాన్ని ఖండిస్తున్నామని.. ఆయా దేశాల మధ్య శాంతి పరిఢవిల్లాలని ఆకాంక్షించారు. యుద్ధాన్ని ఆపే దిశగా భారత ప్రభుత్వం ప్రయత్నం చేయాలని తీర్మానం చేస్తున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు.

**పారాక్వాట్ గడ్డి మందుని నిషేధించాలి**

తెలంగాణలో పారాక్వాట్ డైక్లోరైడ్ గడ్డి మందుని నిషేధించాలని అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రవేశపెట్టారు. రైతులు వ్యవసాయానికి వాడుతున్న పారాక్వాట్ డైక్లోరైడ్ ప్రమాదకరంగా మారిందని.. అందుకే తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నట్లు సభ్యులకు మంత్రి వివరించారు. ఇది ప్రాణాంతక రసాయనమని.. దీన్ని అనేక దేశాల్లో నిషేధించారని తెలిపారు. పారాక్వాట్ డైక్లోరైడ్ వాడడం వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలతో రైతులు, రైతు కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఇది వాడి అనేక మంది అన్నదాతలు ప్రాణాలు కోల్పోయారని చెప్పుకొచ్చారు. సుస్థిర సేంద్రీయ వ్యవసాయ లక్ష్యాలకు ఇది అడ్డుగా మారిందని.. దీని తయారీ, వాడకం, రవాణా, దిగుమతి ఇలా అన్ని విధాలుగా నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు గడ్డి మందుని నిషేధించాలని కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తూ రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేశారు. ఇటీవలే నడుగు రాహుల్ రామకృష్ణ సోదరుడు దీనికి బలయ్యారు.

# పౌర స్వేచ్ఛను హరించే బిల్లు

- ఇదొక క్రూరమైన ఆయుధం
- విమర్శకుల నోళ్లు మూయించే కుట్ర
- హేట్ స్పీచ్ బిల్లుపై కెటిఆర్ విమర్శలు



**హైదరాబాద్, నీలగిరివార్త :**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ (ప్రివెన్షన్) బిల్లు' పై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ బిల్లును పౌర స్వేచ్ఛను హరించే ఒక 'క్రూరమైన ఆయుధం'గా కేటీఆర్ అభివర్ణించారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం తన విమర్శకుల నోళ్లు మూయించేందుకే ఇటువంటి నిరంకుశ చట్టాలను తీసుకువస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. ఈ బిల్లు చట్టరూపం దాల్చితే రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు వాటిల్లుతుందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక సామరస్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యతే అయినప్పటికీ, ఈ బిల్లులోని నిబంధనలు అత్యంత అస్పష్టంగా ఉన్నాయని ఆయన విమర్శించారు. 'అమలు యంత్రాంగం ఆధారాల కంటే అధికారుల వ్యక్తిగత అభిప్రాయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా ఈ బిల్లు రూపకల్పన జరిగింది. ఇది కచ్చితంగా దుర్వినియోగానికి దారితీస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. బిల్లులో ఉపయోగించిన 'వ్యతిరేక భావాలు ప్రేరేపించడం','సామాజిక సమగ్రతను దెబ్బతీయడం' వంటి పదాలకు స్పష్టమైన న్యాయ పరిమితులు లేవని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలను లక్ష్యంగా చేసుకునేందుకే ఈ పదజాలాన్ని పొందుపరిచారని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాలను విమర్శిస్తే వాటిని 'ఫేక్ న్యూస్'గా ముద్రవేసి జైలుకు పంపే ప్రమాదం పొంచి ఉందన్నారు. 'శ్రేయా సింఘల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తుచేశారు. కేవలం ప్రత్యక్ష హింసకు ప్రేరేపించే మాటలపైనే నియంత్రణ ఉండాలని, విమర్శ లేదా వ్యంగ్యం శిక్షార్హం కాదని కోర్టు స్పష్టం చేసిందని ఆయన తెలిపారు. ఈ పరిమితిని మించి చట్టాలు చేయడం ఆర్టికల్ 19(1)(జీ) ప్రకారం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని స్పష్టం చేశారు. ఏడు నుంచి పది సంవత్సరాల వరకు జైలు శిక్షలను ప్రతిపాదించడం ద్వారా ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టించాలని ప్రభుత్వం చూస్తోందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'జర్నలిస్టులు, విద్యార్థులు, సామాన్యులు తమ అభిప్రాయాలను పంచుకోవాలంటేనే భయపడేలా ఈ శిక్షలు ఉన్నాయి. ఇప్పటికే దేశంలో హేట్ స్పీచ్‌పై తగినన్ని చట్టాలు ఉండగా, అదనంగా ఈ చట్టం తీసుకురావడంలో ఆంతర్యం ఏమిటి..?'అని కేటీఆర్ ప్రశ్నించారు. వెంటనే ఈ బిల్లును పున: పరిశీలించాలని, ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ అణచివేత ధోరణిని వీడాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



# మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయండి

మొదటిపేజీ తరువాయి..

కన్‌స్ట్రక్షన్స్ మైనింగ్‌పై వ్యవహారాలపై హౌస్‌కమిటీ వేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో గత పదేండ్ల కాలంలో జరిగిన ప్రతి అక్రమ మైనింగ్‌పై పూర్తిస్థాయిలో సీబీ సీ-ఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్టు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

**హౌజ్‌కమిటీ వేసి విచారణ జరపాల్సిందే**

రాజ్యాంగం మీద ప్రమాణం చేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన మంత్రి పొంగులేటి అవినీతి ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి అన్నారు. ప్రభుత్వానికి కట్టాల్సిన డబ్బులు కట్టకుండా, ఎలాంటి అనుమతులు లేకుండా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ మైనింగ్ అక్రమాలకు పాల్పడిందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై మధుసూదనాచారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం గన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడుతూ మంత్రి పొంగులేటి అవినీతి మొత్తం సాక్ష్యాలతో సహా హరీశ్ రావు బయటపెట్టారని ఆయన తెలిపారు. ఈ ప్రభుత్వం దుర్మార్గ వైఖరితో బీఆర్ఎస్ శాసనసభ్యులను సస్పెండ్ చేసిందని మధుసూదనాచారి మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్తులను కాజేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న పొంగులేటిని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. స్వయంగా సీఎం కూడా ఈ అక్రమాల్లో భాగస్వామ్యంగా ఉన్నారని ఆరోపించారు. పొంగులేటిని తక్షణమే బర్తరఫ్ చేయాలని శాసన మండలిలో డిమాండ్ చేస్తామని తెలిపారు.

# ఇరాన్ దిగిరాకపోతే స్మాష్ చేస్తాం

## మరోమారు తీవ్ర హెచ్చరిక చేసిన ట్రంప్



**వాషింగ్టన్:** ఇరాన్ వీలైనంత త్వరగా ఒప్పందం చేసుకుని, హర్మూజ్ జలసంధిని తెరవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. త్వరగా ఒప్పందం కుదుర్చుకోకపోతే.. ఇరాన్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, చమురు క్షేత్రాలు, ఖర్గ్ ద్వీపాన్ని తుడిచిపెట్టేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. ఈమేరకు ట్రూత్ సోషల్‌లో ఓ పోస్టు పెట్టారు. 'ఇరాన్‌లో మా సైనిక కార్యకలాపాలను ముగించేందుకు తీవ్రమైన చర్చలు జరుపుతున్నాం. ఇప్పటివరకు గొప్ప పురోగతి లభించింది. కానీ.. ఏ కారణాలతోనైనా త్వరలో ఒప్పందం కుదరకపోతే, హర్మూజ్ జలసంధిని వెంటనే తెరవకపోతే.. ఇరాన్‌లోని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, చమురు క్షేత్రాలు, ఖర్గ్ ద్వీపాన్ని, అన్ని డీశాలినేషన్ ప్లాంట్లను పేల్చివేసి.. సర్వనాశనం చేస్తాం. 47 ఏళ్ల భయంకర పాలనలో ఇరాన్ చేతిలో హతమైన ఎంతోమంది అమెరికన్ సైనికులు, ఇతరుల పేరిట ప్రతీకారంగా ఈ దాడులు చేపడతాం' అని హెచ్చరించారు.

# 30వేలకు ఎస్సై కక్కుర్తి.. ఏసీబీకి అడ్డంగా బుక్కు

**నాగర్‌కర్నూల్, నీలగిరివార్త :** తిమ్మాజిపేట మండల ఎస్సై ఏసీబీకి పట్టుబడ్డారు. ఒక కేసుకు సంబంధించి ఒక వ్యక్తి నుంచి రూ. 30 వేలు లంచం ఎస్సై డిమాండ్ చేశాడు. ఈ మేరకు సోమవారం 20 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా మహబూబ్ నగర్ ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించి ఏసీబీ డీఎస్పీ వివరాలు వెల్లడించారు. ఇసుక సరఫరా చేస్తున్న ఓ వ్యక్తికి సంబంధించిన ట్రాక్టర్, జేసీబీని పట్టుకొని ఈనెల 5న ఎస్సై హరి ప్రసాద్ రెడ్డి కేసు నమోదు చేసి వివరాలను నాగర్ కర్నూల్ జిల్లా మైనింగ్ అధికారులకు తెలిపారు. మైనింగ్ అధికారులు ఆ వాహనాలకు రూ. 60 వేలు ఫైన్ వేశారు. ఈ డబ్బులను ఈనెల 7వ తేదీన చెల్లించి వాహనాల రిలీజ్ కోసం పత్రాలను తెచ్చి ఎస్సైకి అందజేశాడు. అయితే ఎస్సై రూ. 30 వేలు ఇస్తేనే వాహనాలను విడుదల చేస్తామని డిమాండ్ చేశారు. మైనింగ్ ఫైన్ కట్టడంతో పాటు, మళ్లీ రూ. 30 వేలు కట్టవలసి రావడంతో వాయిస్ రికార్డింగ్‌లు, రూ. 20వేలు చెల్లించిన అంశాలతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. అన్ని ఆధారాలతో ఏసీబీ అధికారులు సోమవారం పోలీస్ స్టేషన్‌కు చేరుకొని ఎస్సైని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ బాలకృష్ణ వెల్లడించారు.

# చైనా సిసి కెమెరాలపై బ్యాన్

## బ్యాక్ డోర్ ఉంటుందన్న అనుమానం..కొత్త నిబంధనలు తీసుకొచ్చిన కేంద్రం



**న్యూఢిల్లీ, నీలగిరివార్త :** చైనీస్ సీసీటీవీ కెమెరాలను నిషేధిస్తూ భారత్ సంచలన నిర్ణయం తీసుకుంది. దేశ భద్రత దృష్ట్యా ఏప్రిల్ 1వ తేదీ నుంచి 'మేడ్ ఇన్ చైనా' కెమెరాల వినియోగంపై కేంద్ర ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించబోతోంది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ప్రస్తుతం భారత మార్కెట్లో హెక్ విషన్ , దాహువా, టీపీ-లింక్ వంటి చైనా కంపెనీల హవా నడుస్తోంది. అయితే.. ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త సర్టిఫికేషన్ నిబంధనల ప్రకారం.. ఇంటర్నెట్‌తో అనుసంధాన మయ్యే ఈ చైనా కంపెనీల నిఘా పరికరాల అమ్మకాలను భారత్‌లో నిలిపివేయనున్నారు. ముఖ్యంగా 'స్టాండర్డంల్గ÷జేషన్ టెస్టింగ్ అండ్ క్వాలిటీ సర్టిఫికేషన్' అనుమతి ఉన్న కెమెరాలను మాత్రమే ఇకపై దేశంలో విక్రయించాల్సి ఉంటుంది. నిఘా పరికరాలు అత్యంత సున్నితమైన సమాచారాన్ని సేకరిస్తాయి. విమానాశ్రయాలు, ప్రభుత్వ భవనాలు, రవాణా కేంద్రాలు వంటి కీలక ప్రాంతాల్లో వీటిని ఉపయోగిస్తారు. ఈ క్రమంలో చైనా కెమెరాల ద్వారా దేశ భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని భారత భద్రతా సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ కెమెరాల్లో రహస్యంగా 'బ్యాక్ డోర్' యాక్సెస్ ఉండే అవకాశం ఉందని, దీని ద్వారా సేకరించిన సమాచారం విదేశీ సర్వర్‌లకు చేరే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రక్షణ సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో చైనా కెమెరాలను వాడటం వల్ల మన వ్యూహాత్మక సమాచారం బయటకు వెళ్లే అవకాశం ఉంది. ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న సర్వైలెన్స్ మార్కెట్‌లలో ఒకటి. తాజా నిర్ణయం వల్ల చైనా కంపెనీలకు గట్టి దెబ్బ తగిలే అవకాశం ఉండగా.. భారతీయ తయారీదారులకు ఇది పెద్ద అవకాశంగా మారనుంది. తద్వారా 'మేక్ ఇన్ ఇండియా' ఉత్పత్తులకు మార్కెట్లో డిమాండ్ పెరగనుంది. మొత్తానికి.. డేటా భద్రతే లక్ష్యంగా ప్రధాని మోదీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం టెక్నాలజీ , రక్షణ రంగాల్లో పెను మార్పులకు దారితీయనుంది.

# ఇందిరాగాంధీ వల్లే దేశంలో నక్సలిజం

మొదటిపేజీ తరువాయి..

కూడా కోరు కుంటున్నారని అమిత్ షా స్పష్టం చేశారు. 'నక్సలిజంపై పోరులో ప్రజలుకూడా మాకు అండగా నిలిచారు. వేల మంది సైనిక బల గాలు,పోలీసులను నక్సల్స్ చంపారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సైనికులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం. ఇప్పుడు ప్రతి ఒక్కరూ అభివృద్ధినే కోరుకుంటున్నారు.. హింస కాదు. బస్తర్ యువకులను కలిశా.. వాళ్లందరూ నక్సలిజాన్ని వ్యతిరేకించారు. ప్రస్తుత సమాజంలో నక్సలిజానికి తావు లేదు. ఎన్డీఎ పాలనలో మారుమూల ప్రాంతాల్లోనూ అభివృద్ధి జరుగుతోంది. నక్సలైట్ల ఎజెండాలో అభివృద్ధి అన్నది లేదు. నక్సలైట్లు తమ ఉనికి కోసమే పోరాడుతున్నారు. నక్సలైట్లు.. భగత్‌సింగ్, బిర్సాముండా కారు. వాళ్లతో నక్సలైట్లను పోల్చకూడదు. 'రోడ్లు, విద్యుత్ వంటి సదుపాయాలు లేకుండా గిరిజన ప్రాంతాలు ఎలా అభివృద్ధి చెందుతాయి. నక్సల్స్.. చిన్న పిల్లలకు తుపాకులు, ఆయుధ సామాగ్రి ఇచ్చారు. ఏజెన్సీ ప్రాంతాల యువత జీవితాలను నక్సల్స్ నాశనం చేశారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో నిరక్షరాస్యత ఎక్కువగా ఉంది. విద్య, వైద్య, మౌలిక వసతులను కూడా నక్సల్స్ ధ్వంసం చేస్తున్నారు. మనం ప్రజాస్వామ్య దేశంలో ఉన్నాం.. రాజ్యాంగాన్ని స్వీకరించాం. ఆయుధాలు చేపట్టి ప్రజల ప్రాణాలు తీయాలని ఏ సిద్ధాంతాలు చెప్పాయి? ప్రజల ప్రాణాలు తీసే హక్కు ఎవరికీ లేదని నక్సల్స్ గ్రహించాలి. స్కూళ్లు, బ్యాంకులు, ఆస్పత్రులు తగలబెట్టేవారి వల్ల అభివృద్ధి ఎలా సాధ్యం? ఆయుధాలు చేతుల్లోకి తీసుకోవడం ఏ సమస్యకూ పరిష్కారం కాదు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల నుంచే నక్సలిజం అభివృద్ధి చెందింది. ఇందిరా గాంధీ వల్లే మావోయిస్టు పార్టీ అన్ని ప్రాంతాలకు విస్తరించిందని అమిషా ధ్వజమెత్తారు.

# ఉద్యమకారులు లేకుంటే మనమంతా లేనట్లే

## మండలిలో విజయశాంతి సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, నీలగిరివార్త :** తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి విజ్ఞప్తి చేశారు. సోమవారం శాసనమండలిలో ఎమ్మెల్సీ విజయ శాంతి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటిపోయినా.. ఇంకా ఉద్యమకారులకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలు సైతం అమలు కాలేదన్నారు. ఉద్యమంలో ప్రాణాలర్పించిన వారి కుటుంబాలలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని మాట ఇచ్చామని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఎమ్మెల్సీ విజయశాంతి గుర్తుచేశారు. ఆయా కుటుంబాలకు నెలకు రూ.25 వేల అమరవీరుల గౌరవ పెన్షన్ ఇస్తామని హామీ సైతం ఇచ్చామని ప్రభుత్వానికి వివరించారు. ఉద్యమకారులకు మనం తొలి ప్రాధాన్యం ఇస్తామని భరోసా కూడా ఇచ్చామని ఎమ్మెల్సీ విజయశాంతి తెలిపారు. ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ఉద్యమకారులు తమను ప్రశ్నిస్తున్నారని శాసనమండలి వేదికగా ఎమ్మెల్సీ విజయశాంతి వివరించారు. ఉద్యమకారులపై పెట్టిన కేసులు ఎత్తి వేసి జూన్ 2వతేదీ నాటికి వారికి తెలంగాణ ఉద్యమకారులుగా ప్రభుత్వ గుర్తింపు కార్డు ఇస్తామని హామీ ఇచ్చామని.. అది కూడా ఇంకా నెరవేరలేదని విజయశాంతి చెప్పారు. ఉద్యమకారులు లేకపోతే సీఎంలు, మంత్రులు ఉండేవారా? అంటూ ఎమ్మెల్సీ విజయశాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమకారులను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. ఆ బాధ్యతను కాంగ్రెస్ నెరవేరిస్తే మరో చరిత్ర అవుతుందని.. పట్టించుకోకుంటే చారిత్రక తప్పిదం అవుతుందని విజయశాంతి పేర్కొన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలంటూ ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఎమ్మెల్సీ విజయశాంతి సూచించారు

# ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థ

మొదటిపేజీ తరువాయి..



ఇచ్చాం. రైతులకు లాభం చేకూర్చడమే కాదు..పేదల ఆకలి తీరుస్తున్నాం. సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ మాఫియా తగ్గింది. వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం అని అన్నారు.పంట మార్పిడి విషయంలో రైతులపై ఒత్తిడి తీసుకురామని.. వారికి అవగాహన కల్పిస్తామని తెలిపారు. పేదలకు ఇచ్చే సన్న బియ్యం కోసం రూ.14,560 కోట్లు ఖర్చు పెడుతున్నామని, దాంట్లో కోతలు పెట్టమని స్పష్టం చేశారు. సన్న బియ్యం పక్కదారి పట్టడం లేదని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సన్న బియ్యంతో అసెంబ్లీలో అందరికీ మంచి భోజనం పెట్టారన్నారు. పేదలందరికీ ప్రభుత్వ పథకాలు కచ్చితంగా అందుతాయని పేర్కొన్నారు ముఖ్యమంత్రి. వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారని.. తాము మాత్రం వరి వేస్తే బోనస్ ఇస్తున్నామని ధీమా వ్యక్తంచేశారు. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 50శాతం సీట్లు పెంచితే.. దక్షిణ భారత దేశానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని పునరుద్ఘాటించారు. దక్షిణాదిపై ఉత్తరాది ఆధిపత్యం చెలాయిస్తుంది. దక్షిణాదిలో ఒక్క సీటు రాకున్నా కేంద్రంలో సర్కారు ఏర్పాటు చేసుకోవచ్చు. రాష్ట్రాల సీట్ల మధ్య అంతరం.. పెంచిన తర్వాత కూడా అంతే ఉండాలి. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ పార్టీల సమస్య కాదు. 50శాతం సీట్ల పెంపుపై విస్తృతంగా చర్చ జరగాలన్నారు. పార్టీలకు అతీతంగా దక్షిణాదిలో కార్యాచరణ ఉండాలి. దేశంలో నియంత పాలన రాకూడదన్నదే నా ఉద్దేశం. నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఏదేదో మాట్లాడుతున్నారని.. తెలంగాణలో రాష్ట్రపతి పాలన పెడతామంటున్నారని మండిపడ్డారు.మరి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పెట్టరా? అంటూ ప్రశ్నించారు. నియోజకవర్గాల పునర్విభజనను 50 శాతం సీట్ల ప్రాతిపదికన చేస్తే దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందని, 50 శాతం సీట్లు పెంచుతున్నామని చెప్పినా ఉత్తర భారతదేశానికి లాభం జరుగు తుందని ఆరోపించారు.

# పెరంబూర్ నుంచి విజయ్ నామినేషన్

మొదటిపేజీ తరువాయి..

అబద్ధాలు చెప్పనని, వంచనకు పాల్పడనని విజయ్ హామీ ఇచ్చారు. రాష్ట్రంలో మత్తు పదార్థాల వాడకాలతో హింసాత్మక దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. డీఎంకే దుష్టశక్తి పాలనలో భద్రత ఉందా? మీ పిల్లలు క్షేమంగా ఉండగలరా? మీరు ప్రశాంతంగా బతకగలరా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని లిక్కర్ కార్పొరేషన్ టీఏఎస్ఎంఏసీలో రూ.1,000 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. డీఎంకే ప్రభుత్వంలో భద్రత కానీ, ఉపాధి కానీ లేదని,టీవీకే 'విజిల్' గట్టిగా ఊది డీఎంకేను ఈ ఎన్నికల్లో తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఇకపోతే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి పోటీ చేస్తున్న టీవీకే అధినేత విజయ్ జోసెఫ్ తన ఆస్తుల వివరాలను వెల్లడించారు. మొత్తం రూ.404.58 కోట్ల విలువైన చరాస్తులు ఉన్నట్లు పేర్కొన్నారు.

# అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లు

మొదటిపేజీ తరువాయి..

మొదటి సారి రుజువు అయితే ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుంది. శిక్షతోపాటు రూ. 50 వేలు జరిమానా విధిస్తారు. ఇదే ఘటన మరోసారి పునరావృతమైతే జైలు శిక్ష పదేళ్లు, రూ. లక్ష జరిమానా విధిస్తారు. ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో విద్వేష పూరిత ప్రకటనలు, ప్రసంగాలు సైతం పెరిగాయని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఇకపై సంఘం, సమూహం, సమావేశాల్లో ద్వేషపూరిత ప్రసంగాలు, రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు ఉండొద్దని ప్రభుత్వం నిర్ణయించింది. మతం, జాతి, కులం, వర్గం, స్త్రీ, పురుష, లైంగిక, జన్మస్థలం, నివాసం, భాష, అశక్తత, తెగలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు, ప్రసంగాలు ఉండొద్దని ఈ బిల్లును తీసుకొచ్చింది. మాటల ముద్రణ, ప్రచురణ, ఎలక్ట్రానిక్ మాధ్యమం/సాధనాల ద్వారా సమాచార మార్పిడి ఉన్నా ఈ చట్టం పరిధిలోకి వస్తాయి. ఈ బిల్లు ద్వారా ఎలాంటి అసభ్యకర కంటెంట్, సందేశం, సమాచారం ఉంటే వాటిని తొలగించాలని ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సర్వీస్ ప్రొవైడర్లను హెచ్చరించే అధికారం అధికారులకు ఉంటుంది. ఇక మీద సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడినా?, రెచ్చగొట్టే పోస్టులు చేసినా జైలు శిక్ష తప్పదు! అయితే హేట్ స్పీచ్ బిల్లు అత్యంత ప్రమాదకరమని బిజెపి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. రాజకీయ కక్షసాధింపులకే హేట్ స్పీచ్ బిల్లు అన్నారు. తెలంగాణ అసెంబ్లీలో హేట్ స్పీచ్ ప్రివెన్షన్ బిల్లును సెలక్ట్ కమిటీకి స్పీకర్ గడ్డం ప్రసాద్ రిఫర్ చేశారు. ఈ సందర్భంగా ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడారు. ఆధారాలు లేకున్నా అరెస్ట్ చేసేలా బిల్లు ఉందని, చట్టాలు ప్రజల రక్షణ కోసం ఉండాలి.. ప్రజల గొంతు నొక్కడానికి కాదని విమర్శించారు. ఇలాంటి చట్టం చేసేముందు హౌస్ కమిటీ వేయాలని.. చర్చ సాగాలని డిమాండ్ చేశారు. సెక్షన్ 4 అనేది ప్రజాస్వామ్యానికి డెత్ వారెంట్ అని.. హేట్ స్పీచ్ బిల్లును వ్యతిరేకిస్తున్నామని ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలియజేశారు.

# జీవో 317ను వెంటనే రద్దు చేయాలి

మొదటిపేజీ తరువాయి..

విషయాన్ని కవిత గుర్తు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ.. జీవో 317ను సమీక్షించి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఈ విషయాన్ని కాంగ్రెస్ స్పష్టంగా పొందుపరిచినట్లు కవిత పేర్కొన్నారు. ప్రస్తుత మంత్రివర్గంలో ఉన్న పలువురు నాయకులు గతంలో ఈ బాధితులకు న్యాయం చేస్తామని హామీలు ఇచ్చిన విషయాన్ని కవిత లేఖలో గుర్తు చేశారు. జీవో 317 వల్ల ఉద్యోగులు మానసిక క్షోభకు గురవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే వన్ టైం రిలీఫ్ కింద ఉద్యోగులు, ఉపాధ్యాయులను స్థానికత ఆధారంగా స్వస్థలాలకు బదిలీ చేయాలని కోరారు. స్థానికతను గుర్తించే నిబంధనల్లో సమూల మార్పులు చేసి.. ఉద్యోగులకు సొంత జిల్లాల్లో పోస్టింగ్‌లు ఇవ్వాలని కవిత లేఖలో పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో మీరు, ప్రస్తుత మీ మంత్రివర్గంలో ఉన్న పలువురు నాయకులు ప్రభుత్వ ఉద్యోగులను మానసిక క్షోభకు గురి చేస్తున్న జీవో నం.317 బాధితులకు న్యాయం చేస్తామని పలు సందర్భాల్లో హామీ ఇచ్చారని లేఖలో గుర్తు చేశారు. వెంటనే జీవో నం.317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు వన్ టైం రిలీఫ్ కింద వారి స్థానికత ఆధారంగా వారి స్వస్థలాలకు బదిలీ చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత అప్పటికే వివిధ ఉమ్మడి జిల్లాల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీనియారిటీ ప్రాతిపాదికన కొత్త జిల్లాల్లో పోస్టింగ్స్ ఇచ్చారు. ఇలా ఉద్యోగులను కొత్త జిల్లాల వారీగా సర్దుబాటు చేయడానికి జీవో నం.317 తీసుకు వచ్చారు. జీవో నం.317ద్వారా ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే ఆ జీవోను రద్దు చేయాలని కల్వకుంట్ల కవిత కోరారు.

# హైదరాబాద్, చెన్నై కంటే గొప్పగా అమరావతి

మొదటిపేజీ తరువాయి..

12 నవంబర్ 2025న 3,00,192 ఇళ్లను పంపిణీ చేసింది. తాజాగా నేడు 1,00,875 టిడ్కో ఇళ్లతోపాటు మరో 1,50,018 ఇళ్లను మొత్తం 2,50,893 గృహాలను పేదలకు సీఎం చంద్రబాబు సర్కార్ అందించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ..'మార్చి నెలలో మొన్ననే ఉగాది, నిన్న రంజాన్ జరుపుకున్నాం. ఇవాళ 2,50,893 మందికి ఇళ్ల పండుగ జరుపు కుంటున్నాం. ఇది ఒక చరిత్ర. మీ అందరిలో ఆనందం చూస్తుంటే, నా జన్మ ధన్యమైందని అనిపిస్తోందని అన్నారు. భవిష్యత్తులో మీకన్నీ శుభాలే జరగాలని, అంతా మంచే జరగాలని కోరుకుంటున్నా. ఒకప్పుడు గుడిసెల్లో ఉండేవారం. ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు ఇవ్వాలని, పక్కా ఇళ్ల నిర్మాణాలకి యుగపురుషుడు ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు. ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండాలనేది టీడీపీ సిద్ధాంతం. ప్రతి ఒక్కరికీ ఇల్లు ఇచ్చే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. గత వైసిపి ప్రభుత్వంలో వ్యవస్థలని అస్తవ్యస్తం చేశారు. అన్నింటినీ సరిచేస్తున్నాం. ధనికవర్గాలు ఉండే మాదిరిగా టిడ్కో ఇళ్లని నిర్మించిన ఘనత టీడీపీదే. మంచి ఇళ్లు కడితే పాడు చేశారు. పేదల పొట్ట కొట్టారు. ఈ ఏడాది చివరికి పది లక్షల ఇళ్లు ప్రజలకి అందివ్వడమే లక్ష్యం అన్నారు. గత ప్రభుత్వం ప్రజావేదిక విధ్వంసంతో మొదలెట్టి రాష్ట్రం మొత్తాన్ని విధ్వంసం చేసింది. ఎక్కడ చూసినా అవినీతి, అధికార దుర్వినియోగం. రూ.174కోట్లు లబ్ధిదారులు కడితే వాటినీ మాయం చేశారు. 82 వేల కుటుంబాలకి ఆ డబ్బును అకౌంట్లలో వేస్తాం. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులని దారి మళ్లించారు. నివాస యోగ్యంకాని స్థలాల్లో ఇళ్లు కట్టించారు. వైజాగ్‌లో ప్యాలెస్ నిర్మించుకున్నారు కానీ పేదలకి ఇళ్లు ఇవ్వడానికి మనసు రాలేదు. అంత పనికిమాలిన ప్రభుత్వాన్ని నేను నా జీవితంలో చూడలేదు. పేదలు ఉండాల్సింది మురికివాడల్లో కాదు. ఇలాంటి టిడ్కో ఇళ్లలో ఉండాలి. మీలో ఆశలు చిగురించాలి. ఇంటి జాగాలేని వారికి జాగా ఇస్తాం. బ్రహ్మాండంగా ఇళు కట్టించి, పేదలకి ఒక ఆస్తి కల్పిస్తాం. ప్రతి ఇంటికీ అఔఉ కనెక్షన్ ఉండాలి. దానికి కూడా రాయితీ ఇస్తాం. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉండాలి. ప్రతి ఇంటికీ తాగునీరు ఇవ్వాలని పథకం మొదలెడితే దాన్నీ పాడు చేశారు. ప్రతి ఒక్క కుటుంబానికి కుళాయి ద్వారా తాగునీరు అందిస్తాం. ప్రతి ఇంట్లో ఎక్కడికక్కడ విద్యుత్ తయారు చేసుకునే అవకాశం కల్పించాం. ఎస్సీలు, ఎస్టీలకి ఉచితంగా విద్యుత్ ఇస్తున్నాం. బీసీలకి రూ.20 వేలు రాయితీ ఇస్తున్నాం. సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం. ఈ ఏడాది 5 లక్షల మంది మహిళలని పారిశ్రామికవేత్తలని చేస్తాం.. అని అన్నారు.

printed, Published and Owned by GUNTOJU VISHNU MURTHY, Printed at V.M. PRINTERS Plot No : 08, Shiva shankar colony, Kuntloor( vil), Abdulpurmet(mdl), Rangareddy(dist). Telangana. Published at V.M.PUBLICATIONS Plot No : 108, Shiva shankar colony, Kuntloor( vil), Abdulpurmet(mdl),Telangana State. Pin : 501505, Editor : GUNTOJU VISHNU MURTHY, RNI No : APTEL/31957/2009. Cell No : 96765 49223.

neelagirivartha@gmail.com

# నీలగిరి వార్త

మన కోసం మన వార్త

NEELAGIRI VARTHA TELUGU DAILY

03 మంగళవారం 31 - మార్చి - 2026

## క్యాన్సర్ స్క్రీనింగ్ మొబైల్ వాహనాలు

● జెండా ఊపి

ప్రారంభించిన గవర్నర్



**హైదరాబాద్,మార్చి30నీలగిరి వార్త**

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల మొబైల్ వాహన సేవలను మెదక్ ప్రజలు ఉపయోగించుకోవాలని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా కోరారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రజల సౌకర్యార్థం భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్)

## సన్నబియ్యం పథకం క్రెడిట్ సీఎం రేవంత్ రెడ్డిదే

● అవే బియ్యంతో ప్రజాప్రతినిధులకు లంచ్: ఉత్తమ్



**హైదరాబాద్,మార్చి30నీలగిరి వార్త:**

సన్నబియ్యం పథకం క్రెడిట్ సీఎం రేవంత్ రెడ్డిదేనని అన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. ఇవాళ్టి(మార్చి 30)తో సన్నబియ్యం పంపిణీ పథకానికి ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా అసెంబ్లీ హాల్ లో సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసి లంచ్ చేశారు.

## ఉద్యమకారులు లేకపోతే సీఎంలు, మంత్రులు ఉండేవారా -ఎమ్మెల్సీ విజయశాంతి

**హైదరాబాద్ బ్యూరో, మార్చి 30,నీలగిరి వార్త**

తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి విజ్ఞప్తి చేశారు. సోమవారం శాసనమండలిలో ఎమ్మెల్సీ విజయ శాంతి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటిపోయినా ఇంకా ఉద్యమకారులకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలు సైతం అమలు కాలేద న్నారు. ఉద్యమంలో ప్రాణాల ర్పించిన వారి కుటుంబాలలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని మాట ఇచ్చామని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఎమ్మెల్సీ విజయశాంతి గుర్తు చేశారు. ఆయా కుటుంబాలకు నెలకు రూ.25 వేల అమరవీరుల గౌరవ పెన్షన్ ఇస్తామని హామీ సైతం ఇచ్చామని ప్రభుత్వానికి వివరించారు. ఉద్యమకారులకు మనం తొలి ప్రాధాన్యం (ఫస్ట్ ప్రయారిటీ) ఇస్తామని భరోసా కూడా ఇచ్చామని ఎమ్మెల్సీ విజయశాంతి తెలిపారు.



# ఘనంగా అభినందోత్సవ సన్మాన సభ..

### భట్రాజులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఉపేక్షించబోము

### తెలంగాణ రాష్ట్ర సంఘం అధ్యక్షులు దేవరాజు విష్ణువర్ధన్ రాజు..

### రాజకీయ,సామాజిక రంగాల్లో ద్ధి చెందాలి

### రాష్ట్ర,జిల్లా,కవులు,మేధావుల,జర్నలిస్టులకు ఘన సన్మానం..



**నీలగిరి వార్త ప్రతినిధి (టి. రమేష్ )కుత్బుల్లాపూర్ :**

రాష్ట్రంలో అత్యధికంగా విద్యావంతులు ,పండిత విద్వాంసులైన భట్రాజు కులస్తులపై ఇకపై ఎంతటి వారైనా అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఉపేక్షించబోమని తమ సత్తాను చూపిస్తామని సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవరాజు విష్ణువర్ధన్ రాజు పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర భట్రాజు సంఘం రాష్ట్ర కమిటీ మూడు సంవత్సరాల పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా నగరంలోని ఇంజాపూర్‌లోని రాష్ట్ర సంఘ భవనంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు దేవరాజు విష్ణువర్ధన్ రాజు అధ్యక్షతన,ప్రధాన కార్యదర్శి ప్రతికంఠం పూర్ణచంద్రర్ రాజు పర్యవేక్షణలో రాష్ట్ర ప్రతినిధులు,మహిళా, యువజన విభాగం,పలు జిల్లాలో నుండి హాజరైన కుల పెద్దలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు.జరిగిన ఈ సభలో భట్రాజు సంఘ అభివృద్ధికి రాష్ట్ర కమిటీ గత మూడు సంవత్సరాలుగా విశేషంగా కృషి చేసిందని రాష్ట్ర ప్రతినిధులు ఉపన్యసించారు..ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు దేవరాజు విష్ణువర్ధన్ రాజు మాట్లాడుతూ భట్టు దీవన బ్రహ్మ దీవెన అని తమ ఆశీర్వాదం తీసుకున్న ఎంతో మంది రాజకీయంగా,సామాజికంగా,సేవా రంగాలలో ఉన్నతులుగా ఎదిగారని పేర్కొన్నారు.సమాజంలో అది ప్రతి ఒక్కరికి తెలుసునని గుర్తుచేశారు.అయినా కూడా తమ కులస్తులను ఏదో విధంగా రాజకీయ నాయకులు నోటికొచ్చినట్టు వాగడం వారి అవివేకాన్ని బహిర్గతం చేస్తుందన్నారు.కష్టాన్ని నమ్ముకుని భట్రాజులు దినదినాభివృద్ధి చెందుతూ సమాజం గర్వించే స్థాయికి ఎదుగుతున్నారని,ఇదే పంథా కొనసాగించాలని పిలుపునిచ్చారు .సమాజ,సమస్యల పరిష్కారంతో పాటు,విద్యావంతులను ప్రోత్సహిస్తూ అనేక రంగాల్లో చేయూత అందిస్తున్నామని చెప్పారు.రాష్ట్రంలోని భట్రాజు కులస్తులందరం సంఘటితంగా ఉంటూ ఐక్యతను చాటుదామని సభాముఖంగా ముక్తకంఠంతో పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సంఘ అభివృద్ధికి కృషి చేసిన రాష్ట్ర కార్యవర్గ సభ్యుల తోపాటు,పలు జిల్లాల సభ్యులను,కవులను,విద్యావంతులను,సావ రాజిక సేవకులను,పలువురు జర్నలిస్టులను రాష్ట్ర కమిటీ ప్రతినిధుల బృందం శాలువా వేసి మెమెంటో లతో బహుకరిస్తూ శుభాభినందనలు తెలిపారు.భవిష్యత్తులో భట్రాజులు ఆర్థికంగా,రాజకీయంగా ముందుకు ఎదగాలని సంఘ నేతలు ఆకాంక్షించారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రతికంఠం పూర్ణచందర్ రాజు మాట్లాడుతూ రాబోయే తరాలకు మన భట్రాజుల విశిష్టతలను తెలియచేయాలని ఆ దిశగా ప్రతి ఒక్కరు తమ కుటుంబాల్లో పిల్లలకు ఇప్పటినుంచే మన పనితనం,ప్రాముఖ్యతను వివరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.భట్రాజు కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేయాలంటే ఇకపై ఏ రాజకీయ నాయకుల కైనా గుండెల్లో దడ పుట్టాలన్నారు.రాష్ట్ర కార్యవర్గం మూడు సంవత్సరాల పదవీకాలం పూర్తయినందున,త్వరలోనే రాష్ట్ర కమిటీకి ఎన్నికలు నిర్వ హించడంతోపాటు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కూరపాటి భూపతి రాజు,గౌరవ సలహాదారుడు చక్రహరి రామరాజు,సహా అధ్యక్షులు పోతుమంచు ప్రకాశ్ రాజు,అధికార ప్రతినిధి బొల్లెపల్లి సీతా రామరాజు, కేశపెద్ది నరసింహరాజు ,కూరపాటి రంగరాజు,తోకచించు పుల్లం రాజు,కార్యనిర్వాహక కార్యదర్శి బ్రహ్మాండభేరి గోపరాజు,ఉపాధ్యక్షులు సరస్వతి రామరాజు,వెంకట రమణరాజు,చక్రాల రేవతినంద్ భట్,కోశాధికారి సరికొండ రామరాజు,కవి పండితులు జయ వీర్ రాజు,రామేశ్వర్ రాజు,గోవర్ధన్ రాజు,యువజన అధ్యక్ష కార్యదర్శులు బహటం వెంకటేశ్వర్ రాజు,ప్రతీకంఠం భరద్వాజ్ రాజు,మహిళా అధ్యక్ష కార్యదర్శులు ప్రతికంఠం హేమలత ,ప్రతికంఠం సావిత్రి ,రుద్రాణి ,గీత,అరుణ శ్రీ,పద్మజ,సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



**మేడ్చల్ జిల్లా సంఘ సభ్యుల పనితీరు భేష్..**

రాష్ట్ర సంఘం ఏ పిలుపు నిచ్చిన జిల్లా అధ్యక్షులు కూరపాటి కరుణాకర్ రాజు నేతృత్వంలో ఐక్యతతో పరిష్కరించుకుంటూ ఆదర్శంగా నిలవడం పట్ల రాష్ట్ర సంఘ ప్రతినిధులు ప్రత్యేకంగా వారి పనితీరు భేష్ అని ప్రశంసించారు.ఇదే స్ఫూర్తి కొనసాగిస్తూ ముందుకు సాగాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లోలబట్టు కృష్ణంరాజు,కార్యనిర్వహక కార్యదర్శి కూరపాటి శ్రీ రామరాజు (రాజు శ్రీ రామ్),ప్రచార కార్యదర్శి సరస్వతి నరేందర్ రాజు,కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు తంగేళ్ల రాధాకృష్ణ భట్,సరికొండ పాపరాజు తోపాటు జిల్లా,నియోజకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లు తో పెట్టుకుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి శంకరగిరి మాన్యాలేనని





### బి ఆర్ టి యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు టైగర్ కృష్ణయ్య

**నిలగిరి వార్త వికారాబాద్ జిల్లా ప్రతి నిధి**

కాంగ్రెస్ ప్రభుత్వాశీ. ఆశా వర్కర్లకి 18 వేల రూపాయలు నెలకు ఫిక్స్ వేతనం ఇస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న ఇచ్చిన హామీ ఎందుకు నిలబెట్టుకోలేరని కృష్ణయ్య ప్రశ్నించారు? టిఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ పెంచిన జీతాలు ఇవ్వడానికే, మూడు, మూడు, నెలలు పెండింగ్లో పెడుతున్నారని ఇలా అయితే ఆశా కార్యకర్తలు ఎలా బతుకగలుగుతారని? కృష్ణయ్య ప్రశ్నించారు. 28వ తారీఖున తెలంగాణ గ్రామీణ ఆరోగ్య ఆశా కార్యకర్తల సంఘం (బిఆర్టియు అనుబంధం) అలాగే బి ఆర్ టీ యు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా, లిచలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించిన బి ఆర్ టీ యు నాయకులను, ఆశ నాయకులను, ఆశా కార్యకర్తలను, ఎక్కడికక్కడ, జిల్లాలల్లో ,హైదరాబాదులో, అక్రమంగా, దౌర్జన్యంగా, బలవంతంగా, ఎక్కడికక్కడ అరెస్టులు చేసి, మహిళలని చూడకుండా అనేక పోలీస్ స్టేషన్లో నిర్బంధించి, అనేక ఇబ్బందులకు గురి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు బి ఆర్ టి యు. తెలంగాణ ఆశ యూనియన్ రాష్ట్ర కమిటీల పిలుపులో భాగంగా బీఆర్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు టైగర్ .కృష్ణయ్య ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ర్యాలీ నిర్వహించి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టైగర్ కృష్ణయ్య మాట్లాడుతూ ... లిఇందిరమ్మ రాజ్యమంటే మహిళలను వేధించడమేనా? అని కృష్ణయ్య ప్రశ్నించారు? మార్చి 11వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా ఆశా కార్యకర్తలు సంపూర్ణంగా సమ్మె చేస్తుంటే, పెండింగ్ లో ఉన్న మూడు నెలల జీతాలు ఇవ్వకుండా, అలాగే పెంచుతామన్న 18000/- రూ జీతం పెంచకుండా., ఆశాల సమస్యల పట్ల ఏ మాత్రం పరిష్కార దిశగా చర్యలు తీసుకోకపోగా, కక్ష సాధింపు చర్యలకు దిగడం, పట్ల ఆశా కార్యకర్తలు ఆగ్రహానికి, గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆశా కార్యకర్తలు చనిపోతే కనీసం వాళ్ళని, వాళ్ళ కుటుంబాలను, ఆదుకోవడానికి 50 లక్షల బీమా, ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలు అందరూ పేదవారని, వాళ్ళ జీతాలు అతి తక్కువ అని, వారికి గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తప్పకుండా ఇవ్వాలని, డిమాండ్ చేశారు. జిల్లాలోని అనేక పీహెచ్సీలల్లో డాక్టర్లు, నర్సులు ,ఆశా కార్యకర్తల పట్ల బెదిరింపులకు పాల్పడుతూ, డ్యూటీలు చేయాలని ,ఒత్తిడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, తీవ్ర పరిణామాలు, ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్మికులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా, మనుగడ సాగించలేదని, గుర్తు చేశారు. ఒకవేళ కార్మికుల సమస్యలు, ఉద్యోగుల సమస్యలు, రైతుల సమస్యలు, నిరుద్యోగుల సమస్యలు, మహిళల సమస్యలు ,ఇంకా అనేక రంగాల ప్రజల సమస్యలు, పరిష్కరించకుంటే, ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం మట్టిలో కలవడం ఖాయమని, హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అబద్దాలకోరు ముఖ్యమంత్రి అని ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అబద్ధాలు మాట్లాడుతూ కాలం వెళ్ళదీస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కళ్ళు తెరిచి కార్మికుల సమస్యలను చూసి పరిష్కరించాలని డిమాండ్ చేశారు ఆశాలకు 18000 ఫిక్స్ వేతనం మూడు నెలల పెండింగ్ వేతనం 50 లక్షల ప్రమాద బీమా గ్రామాల్లో ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు జిల్లాలో అధికారుల రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు లేదంటే పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా ఆశాల ఆందోళన పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం యూనియన్ ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్ ను కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ ఆరోగ్య కార్యకర్తల (ఆశ) యూనియన్ (బి ఆర్ టీ యు అనుబంధం) జిల్లా అధ్యక్షురాలు మంజుల, జిల్లా కార్యదర్శి అనిత, ఇందిరా, శ్యామల, అనురాధ, జ్యోతి నరసమ్మ, జమునా బాయి. విజయలక్ష్మి లావణ్య రాధిక లక్ష్మి అనూష , అనిత మరియు

# కార్యకర్త కుటుంబానికి జనసేన పార్టీ అండ

**కొవ్వూరు నీలగిరి వార్త ప్రతినిధి**

కొవ్వూరు : జనసేన క్రియాశీలక సభ్యత్వాన్ని పొంది ప్రమాదవశాత్తు మరణించిన పత్తి గుల్ల నాగరాజు కుటుంబానికి జనసేన పార్టీ అండగా నిలిచిందని కొవ్వూరు మండల జనసేన అధ్యక్షులు సుంకర సత్తిబాబు అన్నారు. కొవ్వూరు పట్టణం 19వ వార్డుకు చెందిన పత్తి గుల్ల నాగరాజు 2025లో జనసేన క్రియాశీలక సభ్యత్వాన్ని పొంది ఉన్నారు. ఇటీవల ప్రమాదవశాత్తు ఆయన మరణించడంతో రాష్ట్ర జనసేన పార్టీ కార్యాలయం లో రు.5 లక్షల చెక్కును జనసేన పార్టీ ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ సోమవారం వారి కుటుంబ సభ్యులకు అందించడం జరిగింది. ఈ సందర్భంగా పత్తి గొల్ల నాగరాజు కుమారుడు మాట్లాడుతూ తండ్రి మరణంతో కుటుంబం చిన్న పిన్నమవుతున్న నేపథ్యంలో జనసేన పార్టీ మా కుటుంబానికి అండగా నిలిచి ఐదు లక్షల రూపాయలు చెక్కును అందించడం పట్ల జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు రుణపడి ఉంటామని అన్నారు. సత్తిబాబు మాట్లాడుతూ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కార్యకర్తల వారి కుటుంబాలకు అండగా ఉంటారని జనసేన పార్టీ తనకార్యకర్తల ఎల్లప్పుడూ వెన్నంటే ఉంటుందని కష్టకాలంలో భరోసా కల్పిస్తుందని అన్నారు. నాగరాజు కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తండ్రి మరణించిన నాటునుండి వెన్నంటే ఉండి కొవ్వూరు మండల జనసేన అధ్యక్షులు సుంకర సత్తిబాబు రు.5 లక్షల చెక్కును అందించారని వారికి కృతజ్ఞతలు తెలిపారు.



# ముున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**కొవ్వూరు నీలగిరి వార్తప్రతినిధి**

కొవ్వూరు మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందర్ బాబు మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలని ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించాలని పిఆర్సి ప్రకారం జీతాలు చెల్లింపుకు కరువు భత్యం,మధ్యంతర భృతి ఇంజనీరింగ్ కార్మికులకు టెక్నికల్ జీతాలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు పదవి విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచి రిటైర్మెంట్ బెనిఫిట్స్,గ్రాడ్యుటి సౌకర్యాలు కల్పించాలని రిటైర్మెంట్ లేదా చనిపోయిన వారి స్థానాల్లో వారి పిల్లలకు ఉద్యోగాలు సంక్షేమ పథకాలు వర్తించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఎఓ అచ్యుత కుమారి కి వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో అధ్యక్షులు భూపతి రవీంద్ర ప్రధాన కార్యదర్శి పూజారి వాసు సిలీ బంగారు రాజు సిహెచ్ రాజశేఖర్ ఓలిపల్లి పోలీ నాయుడు సిహెచ్ అరుణ్ఆధ్వర్యంలో మీసాల శివశంకర జ్యోతి అల్లం వెంకటలక్ష్మి సంగం రెడ్డి వెంకటరమణ ఎం మాధవరావు వరలక్ష్మి కారంకితిరుమల కవల వెంకటలక్ష్మి బోలా చిట్టెమ్మ చెన్నా కామేశ్వరి తదితరులు కార్మికులు పాల్గొన్నారు



# పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే కూటమి ప్రభుత్వం లక్ష్యం

**కొవ్వూరు నీలగిరి వార్తా ప్రతినిధి**

కొవ్వూరు రాష్ట్రంలో పేద వాడి సొంతింటి కల – సామాజిక గౌరవం ప్రతి కుటుంబానికి శాశ్వత నివాసం కల్పించి, వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర అన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పథకము మన ఇల్లు – మన గౌరవం సామూహిక గృహప్రవేశాలు కార్యక్రమంలో భాగంగా ఆదివారం కోవ్వూరు మండలం, దొమ్మేరు గ్రామంలో హౌసింగ్ లే అవుట్లో చెవ్వూరి నాగలక్ష్మి (భర్త: శ్రీనివాసరావు) నూతన గృహ ప్రవేశం వేడుకలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ "సామూహిక గృహప్రవేశాల" కార్యక్రమం సామాన్యుడి సొంతింటి కలను ప్రభుత్వ సహకారంతో నిజం చేస్తూ జరుపుకుంటున్న ఒక వేడుకని, ప్రతి పౌరుడికి కనీస నివాస వసతి మరియు మౌలిక సదుపాయాలను అందించాలనే ప్రభుత్వ నిశ్చయానికి, ఈ కార్యక్రమం ఒక నిదర్శనం అని అన్నారు. సమాజంలోని ఏ ఒక్కరూ మౌలిక సదుపాయాలు లేకుండా ఉండకూడదు అనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ నాదేళ్ల శ్రీరామ్ , కొవ్వూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బేతిన నారాయణ , దొమ్మేరు సొసైటీ అధ్యక్షులు గారపాటి రామకృష్ణ , ఆరికరేవుల సొసైటీ అధ్యక్షులు చావా శ్రీనివాస్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సూర్యదేవర రంజిత్ , దొమ్మేరు గ్రామ టిడిపి అధ్యక్షులు మురముళ్ల సత్యనారాయణ మూర్తి , యాలమర్తి రాంబాబు , దొమ్మేరు మాజీ ఉపసర్పంచ్ కలగర సుబ్బారావ్ , కలగర చౌదరి , పెండ్యాల బాబూరావు , ఎరుబండి వీర వెంకట రావు , పాలకుర్తి బుజింగరావు , బొంతా వెంకట లక్ష్మీ , జుజ్జవరపు నాగేశ్వర రావు , గెడ్డం వీర్రాజు, చావా శ్రీనివాస్ , మేకల శ్రీను , ఏఎంసీ డైరెక్టర్ జొన్న బాలకృష్ణ , చౌటపల్లి సూర్యనారాయణ , చారమ్మ తదితర ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# పేదరిక నిర్మూలనే పి4లక్ష్యం ఎమ్మెల్యే ముప్పిడి





**కొవ్వూరు నీలగిరి వార్తప్రతినిధి**

కొవ్వూరు పేదరికాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పి - 4 కార్యక్రమాన్ని చేపట్టారని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు

పి 4 కార్యక్రమం చేపట్టి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా కొవ్వూరు లీటరరి క్లబ్ విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కూటమి నాయకులు హాజరయ్యారు .ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుమాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వర్ణంధ్ర విజన్--2047 లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పి--4 కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. ప్రజలు, పారిశ్రామికవేత్తలు, ఎన్నారైలు కలిసి పేదరికాన్ని నిర్మూలించే దిశగా ఈ కార్యక్రమం కీలకంగా పనిచేస్తోందన్నారు. అంబేద్కర్ ఆశయాల సాధనతో సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఇది తోడ్పడుతోందని పేర్కొన్నారు .విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలలో సమగ్ర అభివృద్ధి సాధించడమే పి--4 లక్ష్యమని స్పష్టం చేశారు.సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్న 10 శాతం మంది, వెనుకబడిన 20 శాతం మందికి అండగా నిలవాలనే లక్ష్యంతో పి--4 కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారని తెలిపారు. దాతలు మరియు లబ్ధిదారుల మధ్య ఈ కార్యక్రమం వారధిగా పనిచేస్తోందన్నారు.ప్రైవేట్ భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం మరింత విస్తరించి అట్టడుగు వర్గాల అభ్యున్నతికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.పి 4లో భాగంగా కొవ్వూరు నియోజకవర్గం లో పేదలకు సాయపడిన గెడ్డం విలియమ్స్,కాశీ విశ్వనాధ్, పత్తిపాటి సుబ్బారావు ఈ ముగ్గురికి సర్టిఫికెట్లు అందజేసి సన్మానించారు. ఎమ్మెల్యే ముప్పిటి వెంకటేశ్వరరావు కూటమి నాయకులు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు టూమెన్ కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి గ, మద్దిపట్ల శివరామ కృష్ణ కాకర్ల నారాయుడు సూరపని చిన్ని , దాయన రామకృష్ణ , అర్జిల్లి రామకృష్ణ , బేతిన నారాయణ సుంకర సత్తిబాబు వేమగిరి వెంకట్రావ్ , కాకర్ల సత్యేంద్ర ఉప్పులూరి చిరంజీవి ఉప్పులూరి బాబ్జీ కడదారి నవ్య , ప్రత్తిపాటి వెంకట సుబ్బారావు చావా శ్రీనివాస్ గారపాటి రామకృష్ణ , బొల్లిన నాగేంద్ర , మేకల శ్రీను ఎరుబండి వెంకట్రావ్ ,, కమిషర్ సిహెచ్ వెంకటేశ్వర్లు , మూడు మండలాల ఎమ్మార్వోలు ఎండివోలు, సి వి ఏ పి యూనిట్ యంగ్ ప్రొఫెషనల్ వెంకట పవన్ కౌండిన్య , కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చండూరులో ఆశా వర్కర్ల నిరసన

**చండూరు, నీలగిరి వార్తా ప్రతినిధి, మార్చి 30 :**


కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆశ వర్కర్లు సోమవారం చండూరు మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. రోడ్డుపై మానవహారంగా నిలిచి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ధనుంజయ గౌడ్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు పిక్స 18 వేల వేతనం?ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనేక హామీలు ఇచ్చి ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చలో హైదరాబాద్కు వెళుతున్న ఆశా కార్యకర్తలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిన ఇచ్చిన తర్వాత ఆశాపూర్ కర్ల ఇండ్ల మీద వెళ్లి ముందస్తు అరెస్టులు చేయడం దుర్మార్గమైన చర్య అని అరెస్టులను ఖండించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను తెచ్చి కార్మిక వర్గాన్ని తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఇప్పటికైనా రేవంత్ సర్కార్ బడ్జెట్ సమావేశాల్లో అన్ని రంగాల కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఆశా కార్యకర్తలకు అదనపు పని భారం మోపుతున్నారని, లెప్రసీ సర్వే పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు కట్ట పద్మ, నారపాక నాగమణి, పరమేశ్వరి, వరలక్ష్మి, వేదావతి, జ్యోతి, లక్ష్మి, సుమలత, రేణుక, జయమ్మ, సభ్య, సుజాత, రాధా, నాగమణి, తరుణి తదితరులు పాల్గొన్నారు,



# సాయి మెరిట్ హై స్కూల్‌లో ఘనంగా ఎఫ్ఎల్ఎస్-2026 సర్వే

**ముదిగొండ, మార్చి 30, నీలగిరి వార్త.**

విద్యార్థుల ప్రాథమిక చదువు, లెక్కల నైపుణ్యాలను అంచనా వేయడానికి ప్రభుత్వం చేపట్టిన ఎఫ్ఎల్ఎస్--2026 సర్వే ముదిగొండ మండలం కమలాపురం గ్రామంలోని సాయి మెరిట్ హై స్కూల్‌లో సోమవారం ఘనంగా ప్రారంభమైంది.ఈ సర్వేలో భాగంగా మూడవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. జిల్లా విద్యా పర్యవేక్షణ అధికారి ప్రభాకర్ రెడ్డి, మండల విద్యాధికారి రమణయ్య, పాఠశాల ప్రతినిధి కందుల శంకరయ్య పర్యవేక్షణలో పరీక్షలు సక్రమంగా జరిగాయి.నిబంధనల ప్రకారం 12 మంది విద్యార్థులను యాదృచ్ఛికంగా ఎంపిక చేసి పరీక్షలు నిర్వహించారు. ఒక్కో విద్యార్థిని సుమారు 45 నిమిషాల పాటు పరీక్షించి, వారి చదువు, వ్రాత, లెక్కల సామర్థ్యాలను పరిశీలించారు.సర్వే విజయవంతంగా నిర్వహించేందుకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక గది ఏర్పాటు చేసి, ఉపాధ్యాయులు పూర్తి సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మరియు పరిశీలకులు పాల్గొన్నారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు




# కోదాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా గట్ల నరసింహారావు విజయం.

**మునగాల ప్రతినిధి నీలగిరివార్త: మార్చి 30**

మునగాల:కోదాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో గట్ల నరసింహారావు ఘన విజయం సాధించారు. సోమవారం జరిగిన పోలింగ్‌లో మొత్తం 105 ఓట్లు పోలవ్వగా, నరసింహారావుకు 63 ఓట్లు ఆయన ప్రత్యర్థి ఉయ్యాల నరసయ్యకు 41 ఓట్లు వచ్చాయి. ఒక ఓటు చెల్లకుండా పోగా, 22 ఓట్ల మెజారిటీతో నరసింహారావు విజేతగా నిలిచినట్లు ఎన్నికల అధికారి పాలేటి నాగేశ్వరరావు, సహాయ అధికారి రామకృష్ణారావు,లు ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన ఉపాధ్యక్షుడికి పలువురు న్యాయవాదులు శుభాకాంక్షలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శరత్ బాబు, సిలివేరు వెంకటేశ్వర్లు, నవీన్, శ్రీధర్, రహీం, ధనలక్ష్మి, దుర్గా, హేమలత, రంజాన్ పాష,రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదాలు జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవలి








**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ**

**తాండూర్,మార్చి 30 నీలగిరి వార్త :**

రోడ్డు ప్రమాదాలు జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు. 99 రోజుల పాటు నిర్వహించే ప్రజాపాలన ప్రగతి అమలులో భాగంగా సోమవారం కలెక్టర్ తో పాటు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా తాండూర్ మండలం కరణ్ కోట సిసిఐ కమ్యూనిటీ హాల్లో "అరైవ్ అలైవ్" మాదకద్రవ్యాల వ్యతిరేకత, రోడ్డు భద్రతపై అవగాహన , ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్ల ఎంతోమంది ప్రాణాలను కోల్పోతున్నారని, ప్రమాదాల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతినెల రోడ్డు భద్రతపై సమావేశాలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపడంతో రోడ్డు ప్రమాదాల జరుగుతున్నాయని అదేవిధంగా హెల్మెట్ ధరించకపోవడం వల్ల కూడా రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ సంఖ్యలో మరణాలు జరుగుతున్నాయని కలెక్టర్ అన్నారు. ప్రజలు ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ పై అవగాహన కల్పిస్తూ, కౌన్సిలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రజా ప్రతినిధులు, పోలీస్ శాఖ అధికారులు ప్రజా ప్రయోజనాల కోసం తమ సహకారాలు అందించాలని కలెక్టర్ తెలిపారు. గ్రామ ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు ఇవ్వడంపై సీసీఐ యాజమాన్యాన్ని కలెక్టర్ అభినందించారు .యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. యువత భవిష్యత్తు నాశనం కాకుండా మంచి సమాజ నిర్మాణానికి అందరి సహకారం అవసరమని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ప్రతి వాహనదారుడి బాధ్యత అన్నారు. ముఖ్యంగా వాహనం నడిపే సమయంలో స్పష్టమైన కంటి చూపు ఉండటం అత్యంత అవసరమని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారి తీస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీ మార్గదర్శకత్వంలో "అరైవ్ అలైవ్" కార్యక్రమం మూడవ విడతలో భాగంగా జిల్లావ్యాప్తంగా పలు కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో నిపుణులైన వైద్యులు ప్రజలకు, వాహనదారులకు కంటి పరీక్షలు నిర్వహించి, దృష్టి లోపాలు ఉన్నవారిని గుర్తించి అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు.ముందుగా సీసీఐ గెస్ట్ హౌస్ ఆవరణలో జిల్లా కలెక్టర్ , ఎస్పీ సిసిఐ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి.రాములు నాయక్, డీఎస్పీ నర్సింగ్ యాదయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, సర్పంచ్ రాజ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు, సీసీఐ జనరల్ మేనేజర్ సరోజ, పోలీస్, సిసిఐ అధికారులు పాల్గొన్నారు.

# పూలపల్లి గ్రామాన్ని అభివృద్ధి చేసే విధంగా కృషి చేస్తా

## గ్రామంలో సిసి రోడ్ల పనులు ముమ్మారంగా చేపట్టాము

## గ్రామ సర్పంచ్ భాగ్యలక్ష్మి మహేందర్ రెడ్డి

**. నీలగిరి వార్త వికారాబాద్ జిల్లా**

**ప్రతినిధి నవాబుపేట్ మండలం**

నవాబుపేట్ మండల పరిధిలోని పూలపల్లి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించే విధంగా కష్టపడి పని చేస్తామని గ్రామ సర్పంచ్ భాగ్యలక్ష్మి మహేందర్ రెడ్డి తెలిపారు గ్రామంలో. ఎన్ ఆర్ ఈ జి ఎస్ ఎంపీ ఫన్ కింద 20 లక్షలు తో సీసీ రోడ్ల పనులు చేపట్టామని తెలిపారు అదేవిధంగా డ్వాక్రా మహిళ భవనానికి 10 లక్షల నిధులు తో పనులు చేస్తున్నామని దానితోపాటు స్కూల్ కాంపౌండ్ వాల్ ఆరు లక్షల 30000 తో కాంపౌండ్ వాల్ వర్క్ మొదలుపెట్టామని గ్రామంలో బోర్లు మూడు సాంక్షన్ ఇవ్వడంతో ఐదు లక్షలతో వాటర్ బోర్లు పైపులైన్ వేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని గ్రామ సర్పంచ్ తెలిపారు గ్రామంలో అండర్ డ్రైనేజ్ వీధి దీపాలు అదేవిధంగా స్కూల్ ఆవరణంలోని శుభ్రతను ప్రతి వార్డులో ఎలాంటి సమస్యలు లేకుండా తీర్చిదిద్దే విధంగా చర్యలు చేపడతామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు.మీనా అనంత్ రాములు గౌడ్, అనసూయ నారాయణరెడ్డి, ప్రశాంత్ గౌడ్, హరిజన్ కృష్ణ గౌడ్, హరిజన్ రాజు, గుడిసె శ్రీనివాస్ గౌడ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





# 6వ వార్డులో సిసి రోడ్ల పనులు చేపట్టిన సర్పంచ్ ఎలవర్తి దీపిక దశరథ్

**నీలగిరి వార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవాబుపేట్ మండలం**

ఉప సర్పంచ్ సాకలి శ్రీనివాస్ నారగూడ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామంలో ప్రతి వార్డులో సీసీ రోడ్లకు పనులు చేపట్టిన గ్రామ సర్పంచ్ గ్రామంలో ఉన్న సమస్యలను పూర్తిగా పరిష్కరించి గ్రామాన్ని అభివృద్ధిపరిచే విధంగా చర్యలు చేపడతామని గ్రామ సర్పంచ్ పేర్కొన్నారు. మాసనుల్ల పెంటయ్య ఇంటి నుండి భూచన్పల్లి వెంకటయ్య ఇంటి వరకు అక్కడి నుండి కెనరా బ్యాంక్ వరకు రోడ్డు పనులు జరుగుతున్నాయని గ్రామంలో స్కూల్ కాంపౌండ్ వాల్ వేగవంతంగా పూర్తి చేయడం లక్ష్యంగా పనిచేస్తున్నామని అదేవిధంగా భవనాన్ని కూడా నిర్మిస్తున్నామని పేర్కొన్నారు గ్రామంలో మిగిలి ఉన్న 100 డ్రైనేజీలు కూడా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు ప్రభుత్వపరంగా వచ్చిన నిధులతో గ్రామంలో పలు కార్యక్రమాలను చేపడుతున్నామని గ్రామ సర్పంచ్ అన్నారు గ్రామాన్ని అభివృద్ధి చేసే దిశగా పనిచేస్తున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు శేఖర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి దేవకుమార్ నాగిరెడ్డి అన్నమయ్య పరమయ్య, అనంత్ ఈశ్వర్ రాజు రత్నం జాంగిర్ శ్రీను గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు



# ప్రభుత్వ భూమిని కాపాడాలి.

## సిపిఐ రాష్ట్ర నాయకులు కె యేసు రత్నం.

**నీలగిరి వార్త ప్రతినిధి (టి. రమేష్ )కుత్బుల్లాపూర్ :**

బాచుపల్లి మండల పరిధిలోని నిజాంపేట్ సర్వే నెంబర్ -103, 109 ప్రభుత్వ స్థలాన్ని కబ్జా నుండి కాపాడాలని మేడ్చల్ -మల్కాజ్గిరి జిల్లా ప్రజావానిలో పాల్గోని అడిషనల్ కలెక్టర్ విజేయంద్ర రెడ్డి కీ వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు కె. యేసు రత్నం, సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ నిజాంపేట్ సర్వే నెంబర్ -103 ప్రభుత్వ స్థలంలో తప్పు పత్రాలతో అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నారు అనిఅన్నారు. అలాగే నిజాంపేట్ సర్వే నెంబర్ - 109 ప్రభుత్వ స్థలంలో కొంత స్థలం కబ్జా చేసి తప్పుడు పత్రాలతో అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నారు అని అన్నారు . పై వాటి మున్సిపల్ పర్మిషన్ లేకుండా అదునపు అంతస్థులు ఎలాంటి పర్మిషన్ లేకుండా కడుతున్నారు అని వారు గుర్తు చేశారు .కనుక పై అక్రమ నిర్మాణాలను పరిశీలించి ప్రభుత్వ భూమిని కాపాడాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నరేంద్రర్ ప్రసాద్, సుజాత, రమ దేవి తదితరులు పాల్గొన్నారు.






# విద్యా గ్రూప్ ఆఫ్ స్కూల్స్ లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు.

## అలరించిన విద్యార్థులు

**శేరిలింగంపల్లి నీలగిరి వార్త :**

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీసి వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తమపై ఉందని విద్యా గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ వాణి త్రిమూర్తులు పొన్నాడ అన్నారు. చిన్నప్పటి నుండే పిల్లల్లో కాన్ఫడెన్స్ పెంచడం మా ఉద్దేశమని తల్లిదండ్రుల ప్రోత్సాహం చాలా బాగుందని, ముందు ముందు కూడా ఇలాగే ఉంటే ఇంకా బాగా చదువు చెప్పగలుతామన్నారు. వారిచ్చే ప్రోత్సాహం మరువలేనిదన్నారు.శేరిలింగంపల్లి మండల పరిధిలోని అంజయ్య నగర్ స్కూల్ లో సోమవారం రోజు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యతిదులుగా ప్రముఖ డెర్మాలిస్ట్ డాక్టర్ గోదావరి గైక్వాడ్, ఎస్ ఐ. చైతన్య రెడ్డి లు హాజరై విద్యార్థులకు మెమోంటోలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను మంచి స్కూల్ చూసి చేర్పిస్తారు. అలాంటి మంచి స్కూల్ విద్యా స్కూల్ ఒకటి కావడం మంచి విషయమన్నారు. పిల్లలను కొట్టకుండా మంచి ప్రవర్తన తో వారిని పిల్లలను సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత టీచర్ల పై ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో టీచర్లు పద్మావతి సక్కుబాయి, మధు స్మిత, సుబ్బారావు, కొండల్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.






# అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో టి టి డి బోర్డ్ చైర్మెన్ బి ఆర్ నాయుడు దంపతులు..

**రామచంద్ర పురం నీలగిరి వార్త ..**



భారతి నగర్ డివిజన్ ఎం ఐ జి ఫేస్ 1 శ్రీ రామాలయం లో 27 అడుగుల శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ట 5 రోజుల కార్యక్రమంలో భాగంగా మూడవరోజు జరిగిన హోమము మరియు తదితర పూజా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు చైర్మన్ బిఆర్ నాయుడు సతీ సమేతంగా విచ్చేశారు. తరువాత ఎల్ఐజీ పోచమ్మ ఆలయంలో అమ్మ వారిని దర్శించుకున్నారు , ఈ సందర్భంగా భారతి నగర్ డివిజన్ భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు కంజర్ల కృష్ణమూర్తి బి ఆర్ నాయుడు ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది, ఈ సందర్భంగా ఎంఐజి రామాలయం కమిటీ అధ్యక్షులు రెడ్డి , టీవీ రావు, కమిటీ సభ్యులు బిఆర్ నాయుడు ని ఘనంగా స్వాగతించారు. అలాగే ఎల్ఐజీ పోచమ్మ ఆలయం వద్ద రవి గౌడ్, లక్ష్మణ్, మన్నేశ్రీకాంత్ తదితరులు బిఆర్ నాయుడు ని కలిసి సన్మానించడం జరిగింది.

# విద్యుత్ కార్మికులందరికి ఆర్టీజన్స్ గా గుర్తింపు ఇవ్వాలి

**తాండూరు, మార్చి 30 నీలగిరి వార్త :**

కార్మికులందరికి ఆర్టీజన్స్ గా గుర్తింపు ఇవ్వాలని కార్మికులు ధర్నా చేశారు. సోమవారం తాండూర్ డివిజన్ తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో తాండూరులో ధర్నా చేపట్టారు.తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ సాయిలు, తాండూరు డివిజన్ ఆర్టిజన్స్ కార్మికులు పాల్గొన్నారు. ఆర్టిజన్స్ కార్మికులందరికి ఏపీ ఎస్ ఇ బి రూల్స్ వర్తిప్ప చేయాలని డిమాండ్ చేశారు. 2026 వెతన సవరణ చేయాలని, మిగిలిన కార్మికులందరికి ఆర్టిజన్స్ గా గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



# నేడు దేవరకొండలో ఉచిత సంతాన సాఫల్య శిబిరం!

### సంతానం లేని దంపతులకు లక్ష్మీ విజయ హాస్పిటల్ లో ప్రత్యేక అవకాశం

**దేవరకొండ నీలగిరి వార్త**

సంతానలేమి సమస్యతో బాధపడుతున్న దంపతులకు భరోసా కల్పించేందుకు దేవరకొండ పట్టణంలోని లక్ష్మీ విజయ స్పెషాలిటీ హాస్పిటల్, (ఓ వి ఏ) ఫెర్టిలిటీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో రేపు (మార్చి 31, మంగళవారం) ఉచిత సంతాన సాఫల్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. పట్టణంలోని గాంధీ నగర్, ఇందిరా పబ్లిక్ స్కూల్ వెనుక ఉన్న లక్ష్మీ విజయ హాస్పిటల్ ప్రాంగణంలో ఈ శిబిరం ఉదయం నుండే ప్రారంభం కానుంది.
అరుదైన అవకాశం.. భారీ రాయితీలుఈ శిబిరానికి వచ్చే దంపతులకు నిపుణులైన వైద్యులచే ఉచితంగా కన్సల్టేషన్ మరియు వైద్య సలహాలు అందించనున్నారు. శిబిరం రోజైన రేపు రిజిస్ట్రేషన్ చేసుకునే దంపతులకు చికిత్సల్లో భారీ రాయితీలు కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు:50% రాయితీ: , ఐ యు ఐస్కానింగ్ మరియు సెమెన్ అనాలిసిస్ ( ఎస్ ఏ) పరీక్షలపై సగం ధరకే అవకాశం.15% రాయితీ: సంతాన ప్రాప్తి కోసం చేసే అత్యాధునిక ఐ వి ఎఫ్ చికిత్సపై 15 శాతం డిస్కౌంట్.ఉచిత కన్సల్టేషన్: ఎటువంటి ఫీజు లేకుండానే నిపుణులను సంప్రదించవచ్చు.దంపతులు సద్వినియోగం చేసుకోవాలిసంతానం లేక మానసిక, ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని హాస్పిటల్ యాజమాన్యం కోరింది. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో అత్యాధునిక సాంకేతికతతో ఈ పరీక్షలు నిర్వహించబడతాయి. మరిన్ని వివరాల కోసం 040-29557999, 9666558104, 9666558105 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు.




# ప్రణాళికాబద్ధంగా సమస్యల పరిష్కారం చేయాలి,

### వార్డు సమస్యల పరిష్కారంలో పాలక మండలి కీలక పాత్ర,
### ఆదాయ వనరులు పెంచి అభివృద్ధి దిశగా ముందుకు సాగాలి
### పన్నులు, బిల్లుల వసూళ్లలో ప్రజలను చైతన్యపరచాలి..
### కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్.

**నీలగిరి వార్త, సూర్యాపేట**


జిల్లా కేంద్రంలో సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం స్థానిక రవి మహల్ ఫంక్షన్ హాల్లో మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అధ్యక్షతన నిర్వహించిన పురపాలక సంఘం 2025-26 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్, 2026-27 ముసాయిదా బడ్జెట్ సమావేశానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వార్డు స్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి ప్రణాళికాబద్ధంగా పరిష్కరించడం మున్సిపల్ పాలక మండలి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. నూతన పాలక మండలి తొలి సమావేశంలోనే రూ.107.32 కోట్లతో బడ్జెట్ రూపొందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ బడ్జెట్ లక్ష్యాలకు అనుగుణంగా మున్సిపాలిటీ ఆదాయ వనరులను పెంపొందించి పట్టణ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. పట్టణంలో పరిశుభ్రత నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. రోడ్లు, మురికి కాలువలు, కల్వర్టులు, తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. మహిళల భద్రత, సంక్షేమ పథకాల అమలులో ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. మున్సిపాలిటీకి రావలసిన ఇంటి పన్ను, నల్లా బిల్లులు, ఇతర బకాయిల వసూళ్లలో ప్రజలను చైతన్యపరచి సమయానికి చెల్లించేలా ప్రోత్సహించాలని అన్నారు. అక్రమ భవన నిర్మాణాలను అరికట్టి, మున్సిపాలిటీకి ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా మున్సిపాలిటీ ఆస్తులను పరిరక్షించడంపై దృష్టి సారించాలని, గతంలో జాతీయ, రాష్ట్ర స్థాయిలో సూర్యాపేట మున్సిపాలిటీ సాధించిన గుర్తింపును తిరిగి సాధించేందుకు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి, వైస్ చైర్ పర్సన్ యం. డి. షఫీ ఉల్లా, కమీషనర్ సి. ఎచ్. హన్మంతరెడ్డి, మున్సిపల్ పాలక మండలి సభ్యులు అధికారులు పాల్గొన్నారు




# వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంకు డిప్యూటీ ఈ.ఓగా డి.భాస్కర్ శర్మ నియామకం

**నీలగిరి వార్త వేములవాడ ప్రతినిధి**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయానికి డిప్యూటీ ఈఓగా బదిలీ ప్రస్తుతం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ దేవస్థానం డిప్యూటీ ఈ.ఓగా విధులు నిర్వర్తిస్తున్న భాస్కర్ శర్మను రాజన్న ఆలయానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఆదేశించారు.


Office of the Commissioner,
Endowments Department,
Telangana, Hyderabad.

L.Dis no.C1/5269/2026, Dated:30-03-2026.

Sub: Endowments Department – Sri Laksmi Narasimha Swamy Devasthanam, Yadagirigutta, Yadadri Bhuvanagiri District – Drafting of Deputy Executive officers – Orders Issued.

Ref: Note No.0275/PS (E, F& E)/2026, dt: 25-03-2026 from the Private Secretary to the Hon'ble Minister for Endowments.

-o0o-

Sri D. Bhaskar Sharma who is working as Deputy Executive officer at Sri Laksmi Narasimha Swamy Devasthanam, Yadagirigutta, Yadadri Bhuvanagiri District is hereby drafted to Sri Raja Rajeshwara Swamy Devasthanam, Vemulawada as Deputy Executive officer on working arrangement basis.

Sri P. Naveen Kumar shall attend the duties of Deputy Executive officer in place of Sri D.Bhaskar Sharma at Sri Laksmi Narasimha Swamy Devasthanam, Yadagirigutta, Yadadri Bhuvanagiri District, in the interest of smooth functioning and better administration.

The concerned Executive officers are directed to take necessary action, accordingly.

M.Hanumnatha Rao, I.A.S.
Director/Commissioner

To
1. The Executive officer, Sri Laksmi Narasimha Swamy Devasthanam, Yadagirigutta, Yadadri Bhuvanagiri District
2. The Executive officer, Sri Raja Rajeshwara Swamy Devasthanam, Vemulawada, Rajana Siricilla District.
3. The individuals (Through Executive officer concerned).
4. Copy to the Private Secretary to the Hon'ble Minister for Endowments for information.
5. Extra.

### టిఫిన్ టీ ఫాస్ట్ ఫుడ్ రెస్టారెంట్ల తినుబండారాల యజమానుల ఆధ్వర్యంలో

# స్వచ్ఛంద బంద్ విజయవంతం







### ఆర్డీఓ కార్యాలయం కు వినతి పత్రం అందజేత
### ప్రత్యామ్నాయంగా డెమోస్టిక్ సిలిండర్స్ అందించాలి
### సివిల్ సప్లై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి
### లేదంటే తమ కుటుంబాలు రోడ్డున పడతాయి
### గత్యంతరం లేక కమర్షియల్ సిలిండర్లు వాడుతున్నాం
### వందలాదిగా తరలివచ్చిన తినుబండారాల యజమానులు
### బస్టాండ్ వద్ద ధర్నా ఆర్డీవో కార్యాలయం లో అధికారులకు వినతులు

**దేవరకొండ నీలగిరి వార్త**

దేవరకొండ పట్టణంలోని టిఫిన్ సెంటర్స్ భోజనం హోటల్స్ టీ స్టాల్స్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్స్ యజమానులు గ్యాస్ కొరత కారణంగా సోమవారం స్వచ్ఛంద బంద్ కు పిలుపునిచ్చి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో వినతి పత్రాన్ని అందించి భారీ సంఖ్యలో బైక్ ర్యాలీ నిర్వహించి బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించి ఆర్డీవో కార్యాలయంలోని అధికారులకు వినతి పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్యాస్ తో ముడిపడి ఉన్న తినుబండారాల చిరు వ్యాపారస్తుల మైన మేము తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని డెమోస్టిక్స్ సిలిండర్లను సరఫరా చేయకపోవడంతో గత్యంతరం లేక కమర్షియల్ సిలిండర్ లను వాడుతుంటే సివిల్ సప్లై అధికారులు తమపై దాడులు చేస్తూ సిలిండర్లను సీజ్ చేస్తున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు. తమకు ప్రత్యామ్నాయంగా కమర్షియల్ సిలిండర్లను అందించాలని లేనియెడల తమ వ్యాపారాలు నడవక కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదనను వ్యక్తం చేశారు. తమకు తక్షణమే డెమోస్టిక్ సిలిండర్స్ అందుబాటులో ఉంటే అందించాలని లేనియెడల కమర్షియల్ సిలిండర్ల మినహాయింపు ఇచ్చి తమ వ్యాపారాలు కొనసాగే విధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో టిఫిన్ యజమానులు భోజన హోటల్స్ యజమానులు, టీ స్టాల్స్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్స్ యజమానులు , మిర్చి బండి యజమానులు, రెస్టారెంట్ల యజమానులు, అన్ని తినుబండారాల బండ్ల యజమానులు పాల్గొన్నారు.

# అక్షర ఉత్సవం.. చెరుకుపల్లిలో మార్మోగిన ‘బడిబాట’ నినాదం!

**గుండ్లపల్లి, దేవరకొండ నీలగిరి వార్త**

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా, విద్యా కుసుమాలు వికసించాలనే సంకల్పంతో గుండ్లపల్లి మండల పరిధిలోని చెరుకుపల్లి గ్రామంలో ‘బడిబాట’ కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. సోమవారం ఉదయం స్థానిక జెడ్ పి హెచ్ ఎస్ ఎంపీపీఎస్ పాఠశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం గ్రామ వీధుల్లో ఒక పండుగ వాతావరణాన్ని తలపించింది.
ప్రజాప్రతినిధుల చొరవ.. విద్యావేత్తల అడుగుజాడలుగ్రామ సర్పంచ్ మీసాల రామచంద్రయ్య, గెజిటెడ్ హెచ్ఎం ఇస్లావత్ గోప్య నాయక్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, “నేటి బాలలే రేపటి పౌరులు. ఏ ఒక్క బిడ్డ కూడా చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ ముందస్తు బడిబాట నిర్వహిస్తున్నాం” అని పేర్కొన్నారు.

**ఇంటింటికీ వెళ్లి అవగాహన:**

కేవలం మాటలకే పరిమితం కాకుండా, ఉపాధ్యాయ బృందం మరియు ప్రజాప్రతినిధులు కలిసి ఎండను సైతం లెక్కచేయకుండా గ్రామంలోని ప్రతి ఇంటినీ సందర్శించారు. ఐదేళ్లు నిండిన పిల్లలందరినీ ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారని వివరించారు. బడి మానేసిన బడి బయట ఉన్న విద్యార్థుల వివరాలను సేకరించి, వారిని తిరిగి విద్యాభ్యాసంలో భాగస్వాములను చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

**ప్రభుత్వ రాయితీలు - విద్యార్థులకు వరం:**

గెజిటెడ్ హెచ్ఎం గోప్య నాయక్ మరియు ఎంపీపీఎస్ హెచ్ఎం ముడి శ్రీనయ్య విద్యార్థులకు అందే ప్రయోజనాలను వివరించారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, మూడు జతల యూనిఫాంలు, షూస్, సాక్స్ మరియు బ్యాగుల పంపిణీ ఉంటుందని తెలిపారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనంతో పాటు, విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు ప్రవేశపెట్టిన ‘రాగిజావ’ విశిష్టతను వివరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఇంగ్లీష్ మీడియం బోధన అందుబాటులో ఉందన్న విషయాన్ని స్పష్టం చేశారు.

**యువతకు పిలుపు.. విద్యా పరిరక్షణే లక్ష్యం:**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపసర్పంచ్ చిట్టెమ్మ, విద్యావేత్త జంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల మనుగడ గ్రామ అభివృద్ధికి చిహ్నమని, యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. వార్డు సభ్యులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమం గ్రామంలో విద్యా చైతన్యాన్ని నింపింది. “బడిబాట” కేవలం ఒక కార్యక్రమం కాదు, అది ఒక సామాజిక బాధ్యత అని చాటిచెప్పారు.




# ఆశా వర్కర్లను కాంట్రాక్టు ఉద్యోగులుగా ప్రభుత్వం గుర్తించాలి

### ఎఐటియుసి డిమాండ్
### - నకిరేకంటి కవిత ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్, మేకల శ్రీనివాసరావు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి

**నీలగిరి వార్త, సూర్యాపేట:**

రాష్ట్రంలో పనిచేస్తున్న వేలాదిమంది ఆశ వర్కర్స్ ను రాష్ట్ర ప్రభుత్వం కనీస కాంట్రాక్ట్ వర్కర్ గా గుర్తించాలని కనీస వేతనం 18 వేల రూపాయలు ఇవ్వాలని సోమవారం నాడు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎఐటీయూసీ అనుబంధ సంఘమైన ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు సెంటర్ నుండి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి కొత్త బస్టాండ్ సెంటర్లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ కవిత రాష్ట్ర కన్వీనర్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు సంయుక్తంగా మాట్లాడుతూ ఆశా వర్కర్లకు నెలకు 18 వేల రూపాయలు కనీస వేతనం మంజూరు చేయాలని పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం వెంటనే కల్పించాలని ప్రతి ఆశాకు 10 లక్షల రూపాయల హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం మరియు లైఫ్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని అన్నారు. మెడికల్ డిపార్ట్మెంట్ లో నూతనంగా విడుదల చేసిన నోటిఫికేషన్లు ఆశల అర్హతలను బట్టి ఏఎన్ఎం, జిఎన్ఎమ్, ల్యాబ్ టెక్నీషియన్, తదితర పోస్టులలో ఉద్యోగాలు ఇవ్వాలని ఏదైనా ప్రమాదవశాత్తు డ్యూటీలో చనిపోయిన ఆశకు 10 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ సౌకర్యంతో పాటు ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు గత కొన్ని ఏళ్లుగా పెండింగ్లో ఉన్న సర్వేలు, పోలియో, ఎన్నికల విధులు మరియు పరీక్ష పనికి సంబంధించిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. అక్రమంగా తొలగించిన ఆశలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ రాస్తారోకో కార్యక్రమంలో ఆశ వర్కర్స్ జిల్లా నాయకురాలు రాధా భాగ్యలక్ష్మి, విజయ్ కుమారి, సైదమ్మ ,ఉమా హుస్సేనీ, సోమక్క, జ్యోతి, కలెక్ట సుధా, సరస్వతి, అరుణ,సీత, జయమ్మ, సక్కుబాయి, బైనాబాయి, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఏ ఐ టి యు సి జిల్లా గౌరవ అధ్యక్షులు దంతాల రాంబాబు, గౌరవ సలహాదారులు శ్యామల అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపాలిటీ ఆదాయం పెంచాలి - ఆదాయవనరుల పెంపు తో అభివృద్ధి సాధ్యం

**మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది**

**రూ.107.30 కోట్ల అంచనా బడ్జెట్‌కు ఆమోదం -**

**అభివృద్ధికి అందరూ సహకరించాలి**

**నీలగిరి వార్త, సూర్యాపేట:-**

సూర్యాపేట మున్సిపాలిటీ 2026–27 ఆర్థిక సంవత్సరానికి రూ.107.30 కోట్ల అంచనా బడ్జెట్‌ను రూపొందించి ఆమోదం తెలిపినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి తెలిపారు. నూతన పాలక మండలి ఏర్పడిన తరువాత తొలి సమావేశంగా 2025–26 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్ ,2026–27 ముసాయిదా బడ్జెట్ సమావేశాన్ని సోమవారం స్థానిక రవి మహాల్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవేశపెట్టిన రూ.107.30 కోట్ల బడ్జెట్‌కు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి కోసం ఆదాయ వనరులను పెంపొందించడంతో పాటు ప్రజలు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ ఆదాయ వనరులను విస్తరించడం ద్వారానే పట్టణ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఇంటి పన్నుల ద్వారా రూ.1775 లక్షలు, స్టాంపు డ్యూటీ ద్వారా రూ.600 లక్షలు, నాన్–ట్యాక్స్ ఆదాయం (అద్దెలు) ద్వారా రూ.204.50 లక్షలు, పరిశుభ్రత విభాగం ద్వారా రూ.111.50 లక్షలు, పట్టణ ప్రణాళిక విభాగం ద్వారా రూ.1568.50 లక్షలు, ఇంజినీరింగ్ విభాగం ద్వారా రూ.330.50 లక్షలు ఆదాయం రానుందని వివరించారు.అదనంగా డిపాజిట్లు, రుణాల రూపంలో రూ.110 కోట్లు, నాన్–ప్లాన్ నిధులు రూ.620 లక్షలు, ప్లాన్ నిధులు రూ.5170 లక్షలు, ఇతర నిధులు రూ.240 లక్షలు కలిపి మొత్తం రూ.10730 లక్షల బడ్జెట్ రూపొందించామని తెలిపారు.ఖర్చుల కేటాయింపుల విషయానికి వస్తే సిబ్బంది వేతనాలకు రూ.1420 లక్షలు,పారిశుద్ధ్య నిర్వహణకు రూ.522 లక్షలు, విద్యుత్ చార్జీలకు రూ.344 లక్షలు, రుణాల చెల్లింపులకు రూ.406 లక్షలు, గ్రీన్ బడ్జెట్‌కు రూ.459 లక్షలు, ఇంజినీరింగ్ విభాగ నిర్వహణకు రూ.445 లక్షలు, సాధారణ పరిపాలనకు రూ.219.20 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. అదేవిధంగా పట్టణ ప్రణాళిక విభాగం ఖర్చు కు రూ 7.50 లక్షలు, ప్రజా సౌకర్యాల కోసం రూ.65.73 లక్షలు, అభివృద్ధి పనులకు రూ.445.80 లక్షలు,



1/3 బ్యాలెన్స్ బడ్జెట్‌గా రూ.255.77 లక్షలు కేటాయించడం జరిగిందని తెలిపారు.ఇక డిపాజిట్లు, రుణాలు చెల్లింపులకు 110 లక్షలు కేటాయింపు జరిగిందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రానున్న నాన్–ప్లాన్ గ్రాంట్ కింద రూ.620 లక్షలు, ప్లాన్ గ్రాంట్ కింద రూ.2460 లక్షలు, ఇతర నిధుల కింద అభివృద్ధి పనులకు రూ.2950 లక్షలతో మొత్తంగా 10730 లక్షలు కేటాయించడం జరిగిందని ఆమె వివరించారు.మున్సిపాలిటీకి వచ్చే ఆదాయం ఎక్కువగా సిబ్బంది జీతాలు, విద్యుత్ బిల్లులు, పరిశుభ్రత, నీటి సరఫరా, పండుగలు మరియు ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు ఖర్చవుతోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అదనపు ఆదాయ వనరులను గుర్తించడం అత్యవసరమని సూచించారు. పట్టణాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ఇంటి పన్నులు, నీటి బిల్లులు సమయానికి చెల్లించడం ద్వారా మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు. అక్రమ నిర్మాణాలను నియంత్రించడం, మున్సిపాలిటీ ఆస్తులను పరిరక్షించడం ద్వారా కూడా ఆదాయం పెంచుకోవచ్చని తెలిపారు. అనంతరం జరిగిన సాధారణ సమావేశంలో కౌన్సిలర్లు తమ వార్డుల సమస్యలను చైర్‌పర్సన్, కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఎం.డి. షఫీ ఉల్లా, మున్సిపల్ కమిషనర్ సి.హెచ్. హన్మంతరెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలను మభ్య పెట్టడానికే వాస్తవ విరుద్ధ బడ్జెట్

## బీఆర్ఎస్ కౌన్సిలర్ అంగిరేకుల నాగార్జున

**నీలగిరి వార్త, సూర్యాపేట**

సూర్యాపేట మున్సిపాల్టీలో ప్రవేశపెట్టిన 2026–27 మున్సిపల్ బడ్జెట్ వాస్తవాలకు విరుద్ధంగా ఉందని వాస్తవ బడ్జెట్ కాకుండా ప్లాన్ బడ్జెట్ ప్రవేశపెట్టి ప్రజలను మభ్య పెట్టారని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, 42వ వార్డు కౌన్సిలర్ అంగిరేకుల నాగార్జున అన్నారు. బడ్జెట్ సమావేశం అనంతరం బీఆర్ఎస్ కౌన్సిలర్లతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్ అంచనా ఎక్కువగా వేశారని వచ్చే రాబడి తక్కువగా ఉందన్నారు. నాన్ ప్లాన్ అనేది వస్తే రావచ్చు రాకుంటే రాకపోవచ్చన్నారు. ప్రజలను మభ్య పెట్టేందుకు అంచనా బడ్జెట్ ను 100శాతం వేసి బడ్జెట్ చూపించారన్నారు. ఎస్ఎఫ్ సి నిధులను 100శాతం అధికంగా వేయడంతో పాటు అసలు లేని ఎంపీ, ఎమ్మెల్యే నిధులను కూడా బడ్జెట్లో చూపించారని ఇదంతా ప్రజలను మోసగించడమే అన్నారు. ప్రజలకు వాస్తవ రూపాన్ని చెప్పాలని మనకు అందుబాటులో ఉన్న ఆధాయాన్ని వేయాలి తప్ప రాని దాన్ని వేయవద్దన్నారు. గతంలో మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్రెడ్డి ఎన్నో నిధులు తెప్పించి సూర్యాపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం నిధులు లేకుండా బడ్జెట్ ను అధికంగా చూపి ప్రజలను మోసం చేస్తున్నారని అలా కాకుండా వాస్తవ బడ్జెట్ ప్రజల ముందు ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్ లు ఈద ప్రవీణ్, గాలి సాయికిరణ్, పడిదల సైదులు, విజయనాయక్, తాహేర్ పాషా, బత్తుల ఝాన్సీ, సిరివెళ్ళ లక్ష్మీకాంతమ్మ, పోతురాజు ఇంధుశ్రీలు ఉన్నారు.




# ఎం ఎన్ విద్యాసంస్థల 3వ వార్షికోత్సవ వేడుకలు







**విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల బాధ్యత**

**గ్రామీణ ప్రాంతాలలో ఇంగ్లీష్ మీడియం పాఠశాలను ఏర్పాటు చేయడం అభినందనీయం**

**తల్లిదండ్రుల ఆశయాలను ఆకాంక్షలను నెరవేర్చే దిశగా విద్యను అందించాలి**

**మూడవ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన పలువురు**

**మరింత అభివృద్ధి సాధించాలి**

**దేవరకొండ నీలగిరి వార్త**

ఉన్నత ప్రమాణాలతో విద్యను అందించి విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఎంతైనా ఉందని మైనంపల్లి సర్పంచ్ కకోర్ర రామ్ సింగ్ అన్నారు. దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామంలోని ఎం ఎన్ స్కూల్స్ మూడవ వార్షికోత్సవ వేడుకలు సోమవారం పట్టణంలోని స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎం ఎన్ విద్యాసంస్థల చైర్మన్ కరస్పాండెంట్ నరేష్ చారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మైనంపల్లి గ్రామ సర్పంచ్ కొ ర్ర రామ్ సింగ్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎన్ విద్యాసంస్థల చైర్మన్ కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం కోసం దేవరకొండ పట్టణంలో 2026 27 విద్యా సంవత్సరానికి గాను పట్టణంలో నర్సరీ నుండి పదవ తరగతి వరకు పాఠశాలను ప్రారంభించబోతున్నామని ఈ సందర్భంగా వారు తెలిపారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూప్రతీ ఏడాది పాఠశాలల్లో నిర్వహించే వార్షికోత్సవాలు బడి పట్ల విద్యార్థుల్లో నమ్మకం, విశ్వాసాన్ని నింపుతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రులతోడ్పాటు ఉంటే అద్భుతాలను సృష్టిస్తారన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు ప్రతీ రోజు కొంత సమయం కేటాయించి, వారితో విద్యాపరమైన సామాజిక అంశాలపై చర్చించడం ద్వారా వారిలో భయం పోతోందన్నారు. చదవుతో ఆటపాటలు కూడా చాలా అవసరం అన్నారు.చదువులో క్రమశిక్షణ ఎంతో అవసరమని, అది జీవితములో చక్కటి మార్గాన్ని చూపిస్తుందని తెలిపారు. చదువుతోపాటు వివిధ పోటీలలోనూ, క్రీడారంగములోనూ రాణించాలని తెలిపారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థుల పట్ల ప్రేమానురాగాలతో పాటు వారి చదువుల పట్ల కూడా ప్రోత్సహించాల్సిన బాధ్యత ఎంతో ఉందని తెలిపారు. చదువుకు వయస్సు నిమిత్తం లేదని, పేదరికంతో జీవించేవారు కూడా చక్కటి చదువును అనుభవించిన దాఖలాలు కలవని తెలిపారు. గురు శిష్యుల అనుబంధంతోనే మంచి మార్గంతో కూడిన చదువు లభిస్తుందని తెలిపారు. చదువులో బాగా రాణించాలంటే క్రమశిక్షణ, పట్టుదల, జీవితంలో సాధించాలన్న తపన ఉండాలని తెలిపారు.విద్యార్థుల కళా ప్రదర్శన అద్భుతంగా ఉందని, ఇది ఇక్కడితో ఆగిపోకుండా చూడాలన్నారు.తదుపరి విద్యార్థుల యొక్క సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మైనంపల్లి మాజీ ఉప సర్పంచ్ పులిజాల వెంకటయ్య, మైనంపల్లి వార్డు సభ్యులు కొర్ర కిషన్ నాయక్, సేవ్య నాయక్, నవీన్, పాత్రికేయ మిత్రులు ముసిని అంజన్ పగిడిమర్రి యాదగిరి, రామవత రాంబాబు సముద్రాల వేణు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఫౌండేషన్ లెర్నింగ్ అంచనాకు జాతీయ శాంపిల్ సర్వే

## అబ్జర్వర్ ఎంఈఓ పిడతలవెంకటేశ్వర్లు

**మునగాల ప్రతినిధి నీలగిరివార్త: మార్చి 30**

మునగాల:దేశవ్యాప్తంగా 3వ తరగతి విద్యార్థుల ఫౌండేషన్ లిటరసీ ฉ న్యూమరసీ ( ఎఫ్ ఎల్ ఎస్ ) స్థాయిని అంచనా వేసేందుకు నిర్వహిస్తున్న శాంపిల్ సర్వేలో భాగంగా సూర్యాపేట జిల్లాలోని మునగాల మండలం ఎంపీ ఆర్ ఎస్ శ్రీనివాస నగర్ (బరాఖత్ గూడెం) పాఠశాల ఎంపిక చేయబడింది.ఈ సర్వే ద్వారా విద్యార్థుల చదవడం, అర్థం చేసుకోవడం, లెక్కలు చేయడం వంటి ప్రాథమిక నైపుణ్యాలను పరిశీలించడం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన 400 పాఠశాలల్లో సూర్యాపేట జిల్లా నుంచి 12 పాఠశాలలు ఎంపిక కాగా, వాటిలో ఈ పాఠశాల ఒకటిగా నిలవడం విశేషం.శాంపిల్ సర్వేను ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ ఎస్. లావణ్య సమర్థవంతంగా నిర్వహించారు. ఈ సర్వేకు అబ్జర్వర్‌గా మండల విద్యాధికారి పిడతల వెంకటేశ్వర్లు విచ్చేసి, కార్యక్రమాన్ని పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్. బిక్షం , ఉపాధ్యాయులు ఎం . మధుబాబు పాల్గొని, సర్వే విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించారు.

ఇలాంటి సర్వేలు విద్యార్థుల ప్రాథమిక విద్యా స్థాయిని అంచనా వేసి, భవిష్యత్తులో బోధన విధానాలను మెరుగుపరచడానికి ఉపయోగపడతాయి.



# మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా తప్పనిసరి అమలు చేయాలి:

**తెలంగాణ బీ.సీ.సంక్షేమ సంఘం సూర్యాపేటజిల్లా ప్రధానకార్యదర్శి తోకల సైదులు ముదిరాజ్**

**మునగాల, ప్రతినిధి నీలగిరివార్త: మార్చి 30:**


మునగాల:పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు ప్రత్యేక సబ్‌కోటా తప్పనిసరిగా కల్పించాలని జిల్లాబీ.సీ.సంఘం ప్రధాన కార్యదర్శి తోకల సైదులు ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఇప్పటివరకు పాలన వ్యవస్థలో వెనుకబడిన వర్గాల మహిళలకు సరైన ప్రాతినిధ్యం దక్కకపోవడం ఆందోళనకరమని తెలిపారు. దేశ జనాభాలో మహిళలు దాదాపు 40 శాతం ఉన్నప్పటికీ, రాజకీయ రంగంలో వారి ప్రాతినిధ్యం తక్కువగా ఉండటం దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా బీసీ మహిళలు సామాజిక-- ఆర్థిక రంగాల్లో ఇంకా వెనుకబడి ఉండటంతో, వారికి ప్రత్యేక అవకాశాలు కల్పించకపోతే నిజమైన సమానత్వం సాధ్యమవదని అన్నారు. ఇప్పటి వరకు కొద్ది వర్గాలకే అధికారాలుకేంద్రీకృతమయ్యాయని, భవిష్యత్తులో అన్ని వర్గాల మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు లభించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. బీసీ మహిళలకు ప్రత్యేక సబ్‌కోటా కల్పించడం ద్వారానే సామాజిక న్యాయం ప్రతిష్ఠించబడుతుందని సైదులు స్పష్టం చేశారు.మహిళా రిజర్వేషన్ బిల్లులో కేంద్ర ప్రభుత్వం తక్షణ సవరణలు చేసి బీసీ మహిళలకు ప్రత్యేక కోటా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, విఫలమైతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.



# నూతనంగా ఎంపికైన ఆలయ చైర్మన్ కు సన్మానం

**గట్టుప్పల్, నీలగిరి వార్త ప్రతినిధి, మార్చి 30 :**

గట్టుప్పల్ మండలం శేరిగూడెం గ్రామంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో జరిగిన ఉత్సవాల సందర్భంగా నూతనంగా ఆలయ కమిటీని గ్రామ పెద్దల సమక్షంలో ఎంపిక చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ గా పంకెర్ల యాదయ్యను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. వారితోపాటు ఆలయ కమిటీ మెంబర్లను ఎన్నుకున్నారు. అనంతరం సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ యాదయ్యను గొర్లెటి మునసయ్య లక్ష్మమ్మ కుమారులు, యాదగిరి, మల్లేష్, రమేష్, ప్రభాకర్ గ్రామానికి విచ్చేసి ఆలయాన్ని సందర్శించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు అశోక్?ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా ఎంపికైన చైర్మన్ యాదయ్యకు శాలువా కప్పి సన్మానించారు. ఆలయ అభివృద్ధి కోసం పని చేయాలని, తమ సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని చైర్మన్ కు హామీ ఇచ్చారు.



## ఆదర్శ పంచాయతీ వైపు గా అభివృద్ధి జరగాలి

**నీలగిరి నేలకొండపల్లి మండలం.**

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం సుద్దేపల్లి పంచాయతీ ఆదర్శ పంచాయతీ గా అభివృద్ధి పనులు జరగాలని నేలకొండపల్లి ఎంపీడీఓ. యం.యర్రయ్య సూచించారు. మండలం లోని సుద్దేపల్లి పంచాయతీ లో సోమవారం పర్యటించారు. తొలుత గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పారిశధ్య పనుల పై పలు సూచనలు చేశారు. అనంతరం పంచాయతీ కార్యాలయం లో ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... జిల్లాలోనే పంచాయతీ ని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు పాలకవర్గం కృషి చేయాలని సూచించారు. పారిశుధ్యం పట్ల అప్రమతంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గలిడేపల్లి సుజాత. పంచాయతీ కార్యదర్శి దెమళ్ల నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు గరిడేపల్లి రామరావు, బండారుపల్లి వెంకటేశ్వరరావు, లక్ష్మణ్ రావు, మున్వర్ పాషా తదితరులు పాల్గొన్నారు..



## అపరమేధావి డా. గుగ్గిళ్ళ దివ్యమూర్తికి జ్ఞానరత్న జాతీయ పురస్కారం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ చేతుల మీదుగా అవార్డు సన్మానం

**నీలగిరి వార్త నేలకొండపల్లి మండలం**

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన అపరమేధావి డాక్టర్ గుగ్గిళ్ళ దివ్యమూర్తికి జ్ఞానరత్న జాతీయ పురస్కారం లభించింది. ఈ యొక్క అవార్డును వసుంధర విజ్ఞాన వికాస మండలి వారు దివ్యమూర్తికి అందజేశారు. దివ్యమూర్తి యొక్క ప్రతిభను చూసి అతనికి విద్యారంగంలో ఈ అవార్డు ఇస్తున్నట్టు సంస్థ ప్రతినిధులు తెలియజేశారు. ఈయొక్క అవార్డును దివ్యమూర్తి ఖమ్మం లోని కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ చేతుల మీదుగా అందుకోవడం జరిగింది. దివ్యమూర్తి లాంటి ప్రతిభావంతులు సమాజానికి నేటి యువతరానికి ఎంతో అవసరమని నూతి సత్యనారాయణ గౌడ్ తెలియజేశారు. తదనంతరం గుగ్గిళ్ళ దివ్యమూర్తిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ అవార్డు రావడం సంతోషంగా ఉందని, సన్మానం జరగడం కూడా సంతోషంగా ఉందని దివ్యమూర్తి తెలియజేశారు. ఇప్పటివరకు తనకు 72 అవార్డులు వచ్చాయని, 131 వేదికల మీద సన్మానం జరిగిందని దివ్యమూర్తి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సామాజికవేత్త బూర సైదారావు గౌడ్,అన్నెం గోపాలరావు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బొడ్డు బొందయ్య, జాతీయ సామాజిక సేవా అవార్డు గ్రహీత బొడ్డు బాబురావు, సుధీర్ , వొలిశెట్టి నాగరాజు,కందుల మహేశ్, వంగూరి సూర్య, తదితరులు పాల్గొన్నారు...



## పన్ను లు చెల్లించనివారిని ఉపేక్షించేది లేదు.

హన్మకొండ జిల్లా కలెక్టర్/ బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్.

దేశాయి పేట ప్రాంతం లో ఆకస్మిక పన్ను వసూళ్ల తీరు తనిఖీ.

**వరంగల్ బ్యూరో నీలగిరి వార్త**

పన్ను లు చెల్లించనివారిని ఉపేక్షించేది లేదని హన్మకొండ జిల్లా కలెక్టర్/ బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు.సోమవారం వరంగల్ పరిధి దేశాయి పేట లో పన్ను చెల్లింపుల తీరును కలెక్టర్ ఆకస్మికం గా తనిఖీలు చేపట్టి కొనసాగుతున్న తీరును పరిశీలించి సమర్థవంతం గా చేపట్టుటకు తగు సూచనలు చేశారు.ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్రాంతం లో సుదీర్ఘ కాలం గా పన్నులు చెల్లించడం లేదని ఖచ్చితం గా పన్నులు చెల్లించాలని స్థానికులకు అవగాహన కలిగించారు.అనంతరం అధికారులకు సూచనలు చేస్తూ పన్ను వసూళ్ల కు (ఆర్థిక సం.ముగింపునకు) కేవలం ఒకే రోజు గడువు ఉందని ఈ నేపథ్యం పెద్ద మొత్తం లో బకాయి పడి ఉన్న వారిని గుర్తించి వారి గృహాలకు వెళ్ళి వసూళ్లు చేపట్టాలని అన్నారు. అనంతరం కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయం లో రెవిన్యూ అధికారుల తో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ఆస్తి పన్నుల తో సమాంతరం గా నల్లా పన్నులు చెల్లించేలా చూడాలని ఎలాంటి పన్ను చెల్లింపు లో ఎలాంటి రిబేట్ లు మినహాయింపులు లేవనే విషయాన్ని ప్రజల్లోకి బలం గా తీసుకెళ్లి వసూళ్లు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి సమ్మయ్య బిర్రు శ్రీనివాస్ ఈ ఈ సంతోష్ బాబు డి ఈ రంగారావు ఆర్ ఓ లు బాకం సంతోష్ రావుల ఆనంద్ షహజాది బేగం సీనియర్ అసిస్టెంట్ లింగ మూర్తి ఆర్ ఐ సందీప్ వార్డు ఆఫీసర్లు బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



# రైతుల సమస్యలు పరిష్కరించాలని సిపిఐ(ఎం) ధర్నా







డిప్యూటీ తాసిల్దార్ కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలి సిపిఐ(ఎం) డిమాండ్

తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

**నీలగిరి వార్త నేలకొండపల్లి మండలం...**

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం లో యాసంగి సీజన్ పంట ఉత్పత్తులు రైతుకు చేతికి అందుతున్న సమయంలో తక్షణమే ప్రభుత్వం స్పందించి ధాన్యం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాలని సిపిఐ(ఎం) మండల కార్యదర్శి కె.వి.రామిరెడ్డి, రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరావు డిమాండ్ చేశారు. సోమవారం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయం రావెళ్ల సత్యనారాయణ భవనం నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. రైతులకు ధాన్యం మొక్కజొన్న పంట ఉత్పత్తులు చేతికందిన సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు గత్యంతరం లేక దళారులకు అమ్ముకొని తీవ్రంగా మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కజొన్న ఎకరానికి 25 కుంటాల పరిమితి అనే నిబంధనను తక్షణమే రద్దు చేయాలని అన్నారు. మార్క్ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి తగిన మద్దతు ధరలను చెల్లించాలన్నారు. అన్ని గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి దళారుల నుండి మోసపోకుండా తగిన మద్దతు ధరలతో రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తాసిల్దార్ కు అందించారు. ఈ ధర్నా కార్యక్రమంలో పార్టీ నాయకులు రచ్చ నరసింహారావు, కట్టెకోల వెంకటేశ్వర్లు, దుగ్గి వెంకటేశ్వర్లు, భూక్య కృష్ణ, ఎడ్ల తిరుపతిరావు, ఇంటూరి అశోక్, దుగ్గి నరసింహారావు, పెద్దిరాజు నరసయ్య, బలుసు ప్రమీల, రాసాల నవీన్, ఎలమద్ది లెనిన్, పెదపాక మల్లేశ్వరరావు, కాల్వ కోటేశ్వరరావు, పొన్నం శివరాజు, పాపినేని బాబు, నున్న మధుసూదన్, ఎస్.కె మహిముద్, తెల్లమేకల శేషుబాబు, గురజాల వెంకటేశ్వర్లు, గురజాల ఉపేందర్ రావ్, దేగల హరిప్రసాద్, నెల్లూరు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు...

# సిఎంఎలో మెరిసిన అఖిల నాగ రమ్య






బెంగళూరు వేదికపై సత్తా చాటిన ఖమ్మం విద్యార్థిని

తల్లిదండ్రుల కష్టానికి తగిన ప్రతిఫలం

**ఖమ్మం, నీలగిరి వార్త మార్చి 30:**

నగరానికి చెందిన విద్యార్థిని అర్వపల్లి అఖిల నాగ రమ్య జాతీయ స్థాయిలో నిర్వహించిన సి.ఎం.ఎ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి, బెంగళూరు వేదికపై ప్రశంసలు అందుకుని జిల్లా ఖ్యాతిని చాటింది. సాధారణ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన ఆమె ఈ విజయంతో తల్లిదండ్రుల కష్టానికి తగిన ప్రతిఫలం అందించడమే కాకుండా, అనేక మంది విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచింది. ఖమ్మం నగరంలోని మామిళ్లగూడెంకు చెందిన అర్వపల్లి నగేష్ శ్రీలక్ష్మి దంపతుల కుమార్తె అయిన అఖిల నాగ రమ్య చిన్ననాటి నుంచే చదువులో ప్రతిభ కనబరిచింది. మౌంట్ ఫోర్ట్ స్కూల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివి, పదో తరగతిలో 9.5 జీపీఏతో పాఠశాల టాపర్‌గా నిలిచింది. అనంతరం సాహితి జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి, ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లోనూ అగ్రశ్రేణి ఫలితాలు సాధించింది. ఆమె ప్రతిభను గుర్తించిన తల్లిదండ్రులు, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వెనుకడుగు వేయకుండా గుంటూరులోని ప్రముఖ 'మాస్టర్ మైండ్' కాలేజీలో సి.ఎం.ఎ కోర్సులో చేర్పించారు. తాజాగా విడుదలైన ఫలితాల్లో అఖిల నాగ రమ్య జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించి, బెంగళూరులో జరిగిన గౌరవ కార్యక్రమంలో ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా అఖిల మాట్లాడుతూ, 'నా విజయానికి ప్రధాన కారణం నా తల్లిదండ్రులే. వారి కష్టం, ప్రోత్సాహమే నన్ను ఈ స్థాయికి తీసుకువచ్చాయి. నా విజయం వారికే అంకితం' అని తెలిపింది. అఖిల నాగ రమ్య విజయం పట్ల స్థానికులు, ఉపాధ్యాయులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఆమె చెల్లెలు యువ నాగశ్రీ ప్రస్తుతం గుంటూరులో చార్టెడ్ అకౌంటెన్సీ (సి.ఏ) కోర్సు అభ్యసిస్తుండటం కుటుంబంలో విద్యాపట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తోంది. సంకల్పం, కృషి, కుటుంబ సహకారం ఉంటే ఎంతటి ఉన్నత స్థాయికైనా చేరుకోవచ్చని అఖిల విజయం మరోసారి నిరూపించింది.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం, నీలగిరి వార్త ప్రతినిధి మార్చి 30:**



ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన పి. నాగుల్ మీరా తమ గ్రామంలో వారం రోజులుగా పిచ్చి కుక్కలు తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని, ఇట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఎంపిడిఓ/ ఎంపిఓ లకు రాస్తూ వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కామేపల్లి మండలం శివారు లాల్లతండ నివాసులు, గ్రామంలో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతూ, అమ్మకాలు చేస్తున్నారని, ఈ భూమిని కాపాడి ప్రభుత్వ అభివృద్ధి పనులకు వినియోగించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ, తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం కార్పొరేషన్ శ్రీరామ్ నగర్ రోడ్ నెంబర్ 13 కు చెందిన ప్రజలు తమకు సీసీ రోడ్డుతో పాటు సైడ్ డ్రైనేజీ, మిషన్ భగీరథ పైప్ లైన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ కు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. థాడి లంబాడి హక్కుల సాధన సమితి కార్యదర్శి డీ. శేఖర్ నాయక్ ఖమ్మం గ్రామీణ ప్రాంతంలో మున్నేరు నది సమీపంలో ఉన్న థాడి లంబాడ సమాజానికి చెందిన పూర్వీకుల సమాధి స్థలాన్ని రక్షించుటకు ప్రతిపాదిత రిటైనింగ్ వాల్ కు అనుబంధంగా ఉన్న సర్వీస్ రోడ్డు, డ్రైనేజ్ కాలువ నమూనా డిజైన్ మార్పు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఖమ్మం ఆర్డిఓ కు రాస్తూ పరిశీలించి తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం అర్బన్ మండలం బుర్హాన్ పురంకు చెందిన పి. కృష్ణమూర్తి తనకు పక్షవాతం వచ్చి పది సంవత్సరాలు అవుతుందని దివ్యాంగుల పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నానని ఇప్పటివరకు మంజూరు కాలేదని తనకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డిఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by GUNTOJ VISHNU MURTHY, Printed at V.M. PRINTERS Plot No. 08, Shiva Shankar Colony, Kuntloor, (V) Abdulpurmet (M), Ranga Reddy District, Telangana. Published at V.M. PUBLICATIONS Plot No. 08, Shiva Shankar Colony, Kuntloor, (V) Abdulpurmet (M), Ranga Reddy District, Telangana State. Pin:501505, Editor, GUNTOJ VISHNU MURTHY, RNI NO: APTEL/31957/2009:Cell No: 9676549223.

# పిల్లలకు చదువు అందించడం ద్వారా వారి మొహంలో చిరునవ్వు చూడొచ్చు.

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్.

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త

చదువుకునే పిల్లల్లో ఆనందాన్ని చూడొచ్చుని వరంగల్ సీపీ తెలిపారు. సోమవారం ఫోర్ట్ వరంగల్ మండలంలోని గుంటూరు పల్లి మండల ప్రాథమిక పాఠశాల యందు యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇటుక బట్టీలలో పనిచేస్తున్న వలస కార్మికుల పిల్లలకు కమిషనర్ చేతుల మీదుగా ఎడ్యుకేషనల్ సామాగ్రి యూనిఫార్మ్స్ పంపిణీ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యాసాగర్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వరంగల్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరము ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ అనేది పోలీసు వివిధ ప్రభుత్వ అధికారుల సమన్వయంతో జరుగుతుందని ఆ యొక్క కార్యక్రమంలోనే భాగంగా స్కూలు బయట ఉన్న పిల్లలందరినీ గుర్తించి తప్పనిసరిగా స్కూల్లో చేర్పించాల్సిన అవకాశం ఉందని తెలిపారు అందులో భాగంగానే వివిధ రాష్ట్రాల నుంచి ఉపాధి కొరకు ఇటుక బట్టీలలో పనిచేస్తున్న కుటుంబాలలోని పిల్లలకు సరైన విద్యా అవకాశాలు లేకుండా ఉన్న 120 బాలలను గుర్తించి వారిని అందర్నీ పాఠశాలల్లో చేర్పించడం జరిగింది. ఈ పిల్లలకు సరైన విద్య అందుటకు కు ప్రత్యేకమైన టీచర్స్ ను మరియు యూనిఫాం, బుక్స్ బ్యాగులు, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ సహకారంతో ఇప్పించడం జరుగుతుందని ఇందుకుగాను నేను పోలీసు విభాగాన్ని ఆంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగాన్ని మరియు ఎఫ్ఎం సాంఘిక సేవా సంస్థ వారిని అభినందిస్తున్నాను అన్నారు. అంతేకాకుండా హాజరైన పిల్లలతో ముఖాముఖి నిర్వహించి మీరు ఏం చదువుతున్నారు ఎటువంటి లక్ష్యాలను మీరు సాధిస్తారు అని చెప్పి పిల్లలతో మాట్లాడడం జరిగింది తద్వారా పిల్లలను సభ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ పిల్లలకు రక్షణ, భద్రతతో పాటు వారికి విద్య అందించడం అనేది చట్టప్రకారం ముఖ్యమని కావున సరైన విద్యను అందించినప్పుడే పిల్లల మొహంలో చిరునవ్వును చూడొచ్చని సూచించారు ఈ యొక్క కార్యక్రమంలో హాజరైన వరంగల్ ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్ మాట్లాడుతూ పిల్లల రక్షణ సంరక్షణ విషయంలో అందరం సమన్వయంతో కలిసి పనిచేయాలని సూచించారు. ఈ యొక్క కార్యక్రమంలో నందు అడిషనల్ డీసీపీ చీ. రవి మాట్లాడుతూ ఇటుక బట్టీలో ఓనర్లు గాని ఇతరులు గాని ఎవరైనా పిల్లల్ని పనిలో పెట్టుకున్నట్లైతే జీవనల్ జస్టిస్ యాక్టివ్ ఇతర చట్టాల ప్రకారం శిక్ష పడుతుందని సూచించారు కావున ఇటు కాబట్టి ఇలా ఓనర్లు బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించుటకు సహకరించాలని సూచించారు ఈ యొక్క కార్యక్రమంలో మామునూరు ఏసిపి వెంకటేష్, ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్స్పెక్టర్ జీ.శ్యాంసుందర్,ఆ.× సుధాకర్ గుంటూరు పల్లి సర్పంచి శ్రీకాంత్, ఉపసర్పంచి దండ నరేష్ ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ ,ప్రాజెక్టు కోఆర్డినేటర్లు బత్తుల కరుణ ,ఎర్ర శ్రీకాంత్, కుమ్మరి రవికుమార్, ×జీవీ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ ఆనంద్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్పర్సన్ వసుధ, డిసిపిఓ ఉమా షేర్ ఎన్జీవో కోఆర్డినేటర్ శిరీష దితరులతో పాటు గ్రామ పెద్దలు ఇతరులు పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమంలో భాగంగా హాజరైన 120 మంది పిల్లలకు ఎడ్యుకేషన్ ఖ×ూ, యూనిఫామ్ ఇతర సామాగ్రిని అందించడం జరిగింది.

# బల్దియా ప్రధాన కార్యాలయం లో ప్రజావాణి కార్యక్రమం.

సమస్యల పరిష్కారం కోరుతూ ఫిర్యాదులు అందజేసిన నగర ప్రజలు.

వివిధ విభాగాలకు చెందిన 70 ఫిర్యాదుల స్వీకరణ.

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త

బల్దియా ప్రధాన కార్యాలయం లో సోమవారం ప్రజావాణి( గ్రీవెన్స్) కార్యక్రమం జరిగింది. ఈ సందర్భం గా అదనపు కమిషనర్ చంద్రశేఖర్, వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు నగర ప్రజల నుండి వివిధ సమస్యల పరిష్కారం కోసం అందజేసిన వినతులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాలకు చెందిన అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు విభాగాల వారిగా :

1. టౌన్ ప్లానింగ్......34 2. ఇంజనీరింగ్..........13

3. రెవిన్యూ.........15 4. హెల్త్, శానిటేషన్....02 5. నీటి సరఫరా.....06

మొత్తం = 70

ఈ కార్యక్రమంలో ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్ వెటర్నరీ వైద్యులు డా.గోపాల్ రావు సానిటరీ సూపర్ వైజర్ భాస్కర్ ఏ ఈ లు తదితరులు పాల్గొన్నారు



# ఉన్నత స్థానాల్లో ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు.







హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్.

రంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఘనంగా ప్లాటినం జూబ్లీ వేడుకలు.

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త

వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ప్లాటినం జూబ్లీ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేశ విదేశాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ వైస్ చైర్‌పర్సన్ చాహత్ బాజ్ పాయ్, ఎన్.పిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు అన్ని విభాగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని అన్నారు. కలెక్టరేట్‌లో కూడా ఈ కళాశాలకు చెందిన ఇంజినీర్లు ఉన్నారని తెలిపారు. బీటెక్ చదివిన వారికంటే పాలిటెక్నిక్ చదివిన వారికి ప్రాక్టికల్ నాలెడ్జ్ ఎక్కువగా ఉండి, త్వరగా ఉపాధి అవకాశాలు లభించి స్థిరపడతారని ఆమె చెప్పారు. రూ.28 కోట్లతో నూతన భవన నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల నూతన భవన ప్రారంభోత్సవానికి మళ్లీ పూర్వ విద్యార్థులందరూ రావాలని ఆకాంక్షించారు. తన కుటుంబానికి కూడా పాలిటెక్నిక్ విద్యతో అనుబంధం ఉందని, తన తండ్రి పాలిటెక్నిక్ చదివి ఉన్నత ఉద్యోగం సాధించారని, ఆ ప్రేరణతోనే తాను కలెక్టర్ స్థాయికి చేరుకున్నానని చాహత్ బాజ్ పాయ్ వెల్లడించారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఎన్.పిడిసిఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యకు గొప్ప ప్రాధాన్యం ఉందన్నారు. డిప్లమా, ఇంజినీరింగ్ మధ్య తేడా లేదని, నైపుణ్యమే విజయానికి మూలమని అన్నారు. ఏఐ మనుషులను భర్తీ చేయదని, కొత్త సాంకేతికతలను నేర్చుకుని ముందుకు సాగాలని ఆయన విద్యార్థులకు సూచించారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఇ.వి.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఈ కళాశాలలో చదవడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. దేశ విదేశాల్లో ఉన్న పూర్వ విద్యార్థులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చిన ఈ సమ్మేళనం ప్రత్యేకంగా నిలిచిందన్నారు. కార్యక్రమ విజయవంతానికి సహకరించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్, సంగీత కళాశాల బృందం, పూర్వ విద్యార్థులందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు మేకల అక్షయ్ కుమార్, పి.ఆనంద్ కుమార్, జి.మహేందర్ రెడ్డి, జయశ్రీ , కె.వెంకటేశ్వర్లు, దొడ్డిపల్లి కుమార్, గన్ను సురేందర్, శశిధర్, ఎం.భిక్షపతి, ఎం.ప్రకాశ్, బి.విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఐడీఓసీ భవన సముదాయాల పన్ను బకాయిల చెక్ అందజేసిన.

కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్.

రూ.85.61 లక్షలు బల్దియాకు చెల్లింపు.

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త

హన్మకొండలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సముదాయాలకు (ఐడీఓసీ) సంబంధించిన పన్ను బకాయిలుగా రూ. 85,61,262 మొత్తానికి చెక్‌ను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సోమవారం హన్మకొండ కలెక్టరేట్ కార్యాలయంలో జీడబ్ల్యూఎంసీ (బల్దియా) అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నగర పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు తమకు ఉన్న పన్ను బకాయిలను వెంటనే చెల్లించి బల్దియాకు సహకరించాలని సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సర ముగింపుకు కేవలం ఒక రోజు మాత్రమే గడువు మిగిలి ఉన్న నేపథ్యంలో, మార్చి 31 అర్ధరాత్రి వరకు బల్దియా సేవా కేంద్రాలు నగరవ్యాప్తంగా పనిచేస్తాయని తెలిపారు. నగరవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆస్తి పన్ను, నీటి పన్నుతో పాటు ఇతర బకాయిలను సమయానికి చెల్లించాలని కోరారు. పన్నుల చెల్లింపులో ప్రజల భాగస్వామ్యం నగర అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఎంహెచ్ఓ డా. రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు (అడ్మిన్) సమ్మయ్య, బిర్రు శ్రీనివాస్, ఆర్ఐ అనిల్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు

నీలగిరి వార్త వేములవాడ ప్రతినిధి



కలెక్టర్ గరిమ అగ్రవాల్‌జిల్లాలోని కేజీబీవీలు, టీజీఎంఎస్ రెసిడెన్షియల్ విద్యాలయాలు, హాస్టళ్లకు 20 ఫ్రీజర్ల పంపిణీవిద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో జిల్లాలోని జిల్లాలోని 13 కేజీబీవీలు, ఏడు టీజీఎంఎస్ హాస్టళ్లకు కలిపి 20 ఫ్రీజర్లు కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక చొరవతో సమకూర్చారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ఆయా విద్యాలయాల బాధ్యులకు కలెక్టర్ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తుందని వివరించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలోని విద్యాలయాల విద్యార్థులకు వైద్య ఆరోగ్య శాఖ ఆద్వర్యంలో ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్య పరీక్షలు, సేవలు అందిస్తుం దని తెలిపారు. జిల్లాలోని రెసిడెన్షియల్ విద్యాలయాలు, హాస్టళ్లకు గత చలికాలంలో విద్యార్థులకు వేడి నీళ్లు అందించేందుకు ఇప్పటికే గీజర్లు అందించామని గుర్తు చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహార పదార్థాలను అందించేందుకు ఫ్రీజర్లు ఆయా రెసిడెన్షియల్ విద్యాలయాలు, హాస్టళ్ల బాధ్యులకు అందజేసినట్లు తెలిపారు. ఈ ఫ్రీజర్ల ద్వారా విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలు , కూరగాయలు పాడైపోకుండా నిల్వ చేసుకోవచ్చనీ, పాలు, ఆకు కూరలు, కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలు స్వచ్ఛంగా అందించే అవకాశం ఉందని తెలిపారు. రెసిడెన్షియల్ విద్యాలయాల్లో శుభ్రమైన ఆహారం పదార్థాలు అందించడం, వ్యర్థాల నిర్వహణ, వసతి గృహాలలో మెరుగైన జీవన వాతావరణం కల్పించడానికి ఇన్సినరేటర్, వంటపాత్రలు కూడా గతంలో అందించారు కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, జీసీడీవో పద్మజ, స్పెషల్ ఆఫీసర్స్, కేర్ టేకర్స్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న

తిమ్మరాజు పల్లి చిత్ర యూనిట్.

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త

తిమ్మరాజు పల్లి చిత్ర యూనిట్ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు ఆలయానికి విచ్చేసిన హీరో హీరోయిన్లను ముందుగా వల్లభ గణపతిని దర్శించుకుని అనంతరం అమ్మవారి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ముఖ్య అర్చకులు నాగరాజ్ శర్మ ధర్మకర్త వీరన్న అమ్మవారి ప్రసాదాన్ని అందించారు.



# ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు, పింఛన్, ఇళ్ల స్థలం అమలు చేయాలి..!!





తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకుడు సిలివేరి రవి యాదవ్.

నిలగిరి వార్త, పెద్దపల్లి జిల్లా ప్రతినిధి: మార్చ్ 30 :

పెద్దపల్లి జిల్లాలోని రామగుండం నియోజకవర్గం పరిధిలో తెలంగాణ మలిదశ ఉద్యమకారులపై జరిగిన ముందస్తు అరెస్టులు చేసారు. 23వ డివిజన్ పరిధిలో ఉన్న ఎన్టిపిసి పోలీస్ స్టేషన్ పోలీసులు ఉదయం నుంచి పలువురు ఉద్యమకారులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ చర్యలను తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య హక్కులను హరించే విధంగా జరుగుతున్న ఈ అక్రమ ముందస్తు అరెస్టులు తక్షణమే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. ఉద్యమకారులను అణచివేయడానికి ఇలాంటి చర్యలు చేపట్టడం సరైంది కాదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకుడు సిలివేరి రవి యాదవ్ మాట్లాడుతూ, తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముందస్తు అరెస్టులతో ఉద్యమాన్ని అణచలేరని స్పష్టం చేశారు. ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలలో గుర్తింపు కార్డుల జారీ, నెలకు రూ.25 వేల పింఛన్, 250 గజాల ఇంటి స్థలం వంటి అంశాలు ఉన్నాయని గుర్తుచేశారు. ఈ హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సి వస్తుందని అన్నారు.

# డిగ్రీ కళాశాల భూముల అంశంపై సమీక్ష సమావేశంపై ఎన్ఎస్‌యూఐ ఘాటు విమర్శలు

కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:

కామారెడ్డి జిల్లాలో డిగ్రీ కళాశాల భూముల కేటాయింపులపై నిర్వహించనున్న సమీక్ష సమావేశంపై ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఐరేణి సందీప్ కుమార్ తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. డిగ్రీ కళాశాల భూముల్లో అవినీతి జరిగిందని తమ సంస్థ గతంలోనే ఆరోపణలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.
ముఖ్యంగా అరోరా ఇంజనీరింగ్ కాలేజ్, కర్షక్ బి.ఎడ్ కాలేజ్, సరస్వతి శిశు మందిర్ సంస్థల భూముల కేటాయింపులపై అనుమానాలు వ్యక్తం చేసినప్పటికీ, ఈ సంస్థలను పక్కనపెట్టి మిగతా వారితో మాత్రమే సమీక్ష సమావేశం నిర్వహించడం అనుమానాస్పదంగా ఉందన్నారు. తేదీ. 31-03-2026 న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి సంబంధించి 26-03-2026 న కామారెడ్డి ఎమ్మెల్యే నుండి కలెక్టర్ కి లేఖ అందిందని తెలిపారు. సంబంధిత శాఖలు, సంస్థలు తమకు కేటాయించిన భూముల వివరాలతో హాజరుకావాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సంస్థలను ఆహ్వానించకపోవడం వెనుక ఉద్దేశ్యం ఏమిటని ప్రశ్నించారు. అవినీతి ఆరోపణలు ఉన్న కాలేజీలను ఉద్దేశపూర్వకంగా తప్పించి, సమస్యను పక్కదారి పట్టించేందుకు అధికారులు, ఎమ్మెల్యే కలిసి కొత్త నాటకానికి తెరతీసినట్లుగా ఉందని సందీప్ కుమార్ విమర్శించారు. ఈ నేపథ్యంలో, అరోరా ఇంజనీరింగ్ కాలేజ్, కర్షక్ బి.ఎడ్ కాలేజ్, సరస్వతి శిశు మందిర్ యాజమాన్యాలను కూడా సమీక్ష సమావేశానికి పిలవాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే ఈ వ్యవహారంపై ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలతో కలిసి రాబోయే రోజుల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.




# కరీంనగర్ డిపిఆర్ఓ ను కలసిన కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి

నీలగిరి వార్త వేములవాడ ప్రతినిధి

రాజన్న సిరిసిల్ల ఇంచార్జి జిల్లా పౌర సంబంధాల అధికారి జి లక్ష్మణ్ కుమార్ డిపిఆర్ఓని కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి ప్రపంచ రంగస్థల దినోత్సవం పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలియజేసారు. అనంతరం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి చిత్రపటం, స్వామి వారి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు అలాగే యెల్ల పోశెట్టి జన్మదిన అభినందన సంచికను అందజేయమైనది . ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కళాకారుల ఫోరం కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ కళాతపస్వి యెల్ల పోశెట్టి గాయకులు ఉత్తర తెలంగాణ కళాకారుల విభాగం కోఆర్డినేటర్ బొడ్డు రాములు రంగస్థల కళాకారుల రాజన్న సిరిసిల్ల జిల్లా కళాకారుల విభాగం అధ్యక్షులు వారాల దేవయ్య గాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి మానువాడ లక్ష్మీనారాయణ డప్పు నృత్య కళా కారులు.. జిల్లా కోశాధికారి బుర్రి శంకరయ్య రంగస్థల కళాకారుడు తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు తెలంగాణ ఉద్యమ కళాకారుల ప్రధాన కార్యాలయం వేములవాడ నందు రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి మాట్లాడుతూ సాంస్కృతిక శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు సూచనల మేరకు కళాకారులకు గుర్తింపు కార్డులు జారీ చేసే దిశగా భాష సాంస్కృతిక శాఖ వెబ్సైట్ను రూపొందించింది తెలంగాణ రాష్ట్రంలోని కళాకారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోగలరని కోరుచున్నాము కళాకారులకు ఇట్టి అవకాశాన్ని కల్పించిన మన ముఖ్యమంత్రివర్యులు ఏ.రేవంత్ రెడ్డి కి భాషా సాంస్కృతిక శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు కి భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి కు కళాకారుల రాష్ట్ర కమిటీ పక్షాన హృదయపూర్వక కృతజ్ఞతలు ధన్యవాదములు తెలియజేయుచున్నాము అని తెలిపారు





కళాకారులకు గుర్తింపు కార్డులు

సాంస్కృతిక శాఖ మంత్రివర్యులు శ్రీ జూపల్లి కృష్ణారావు గారి సూచనల మేరకు, కళాకారులకు గుర్తింపు కార్డులు జారీ చేసే దిశగా భాషా సాంస్కృతిక శాఖ website ను రూపొందించింది. కళాకారులు సాంస్కృతిక శాఖ website (www.tgdtculture.com) ద్వారా తమ వివరాలను నమోదు చేసుకొని, Artists ID Card అప్లికేషను ప్రింట్ తీసుకుని, సంబంధిత జిల్లా పౌర సంబంధాల అధికారి (DPRO) గారిచే ధృవీకరించిన అప్లికేషను ను మరల online లో upload చేయవలెను. వాటి ఆధారంగా సాంస్కృతిక శాఖ ఆ అప్లికేషన్ ను, ఆమోదిస్తుంది. ఆమోదం పొందాక ID Card ను online లో download చేసుకోవచ్చును. దీనికి సంబంధించిన వివరాలు సంబంధిత కళాకారుల Mail ID కి పంపించబడుతాయి. కళాకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోగలరు.

డా. ఏనుగు నరసింహారెడ్డి
సంచాలకులు, భాషా సాంస్కృతిక శాఖ

# అసెంబ్లీ సమావేశాలను అడ్డుకుంటారని సర్పంచ్ ల ముందస్తు అరెస్ట్ శోచనీయం

నీలగిరి వార్త వేములవాడ ప్రతినిధి



మాజీ సర్పంచుల ఫోరం జిల్లా నాయకులు, రామన్నపేట మాజీ సర్పంచ్ దుమ్మ అంజయ్య రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలోని సర్పంచుల ముందస్తు అరెస్టు శోచనీయమని రాజన్న సిరిసిల్ల జిల్లా మాజీ సర్పంచుల ఫోరం జిల్లా నాయకులు, రామన్నపేట మాజీ సర్పంచ్ దుమ్మ అంజయ్య అన్నారు. చందుర్తి మండలంలోని రామన్నపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అసెంబ్లీకి తరలి వెళ్తున్నాడని ముందస్తుగా సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని గత కొన్ని నెలలుగా సర్పంచుల జేఏసీ రాష్ట్ర కమిటీ చేస్తున్న నిరసనలకు సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన మొండి వైఖరి ప్రదర్శిస్తూ అసెంబ్లీ సమావేశాలను అడ్డుకుంటారని, అరెస్ట్ చేయడం శోచనియమన్నారు.

# సిరిసిల్ల బార్ అసోసియేషన్ ఎన్నికలు హోరా హోరీగా సాగాయి.

నీలగిరి వార్త వేములవాడ ప్రతినిధి

భార్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఆవునూరి రమాకాంతరావు రాజన్న సిరిసిల్లలో భార్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఆవునూరి రమాకాంతరావు సమీప అభ్యర్థి అయిన జూపల్లి శ్రీనివాసరావు పై గెలుపొందాడు. గోవర్ధన్ రెడ్డి ఏకగ్రీవంగా ఉపాధ్యక్షులుగా ఎన్నికవ్వగా, జనరల్ సెక్రెటరీగా చీకట్ల వెంకటయ్య గెలుపొందాడు. జాయింట్ సెక్రెటరీగా గుడ్ల కిషన్ ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు, క్యాషియర్ గా దేవరాజు ఎన్నికయ్యారు స్పోర్ట్స్ అండ్ కల్చర్ సెక్రటరీగా కీసరి. శ్రీనివాస్, లేడి స్పోర్ట్స్ సెక్రటరీగా బూర్ల. కళ్యాణి, లేడీ రిప్రజెంటేటివ్ గా ఎల్లే. జ్యోతి మరియు లైబ్రరీ సెక్రెటరీగా పుష్పలత లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గెలిచిన అభ్యర్థులు మాట్లాడుతూ అనునిత్యం అడ్వకేట్ల హక్కుల సాధనకై పోరాటం చేస్తామని అన్నారు తమ గెలుపు కోసం కృషి చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తులను గౌరవప్రదంగా కలిశారు.



# కామారెడ్డిలో హీరోయిన్ నిధి అగర్వాల్ సందడి

కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:

కామారెడ్డిలో హీరోయిన్ నిధి అగర్వాల్ సందడి చేసింది. పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తా రోడ్డులో నూతనంగా విశాల షాపింగ్ మాల్ ఏర్పాటు చేశారు. షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి సినీ నటి నిధి అగర్వాల్ హాజరయ్యారు. తరలివచ్చిన అభిమానులుహీరోయిన్ వస్తుందన్న విషయం తెలుసుకున్న ప్రజలు పెద్దఎత్తున షాపింగ్ మాల్ వద్దకు చేరుకున్నారు. అభిమాన నటిని చూసేందుకు ఉత్సాహం చూపారు. ఉదయం 10:30 గంటలకు రావాల్సిన నటి మధ్యాహ్నం 12:00 గంటలకు చేరుకున్నారు. సుమారు రెండు గంటలు జనాలు ఎండలో వేచి ఉన్నారు. నిధి అగర్వాల్ షాపింగ్ మాల్ వద్దకు చేరుకోగానే అభిమానులకు అభివాదం చేస్తూ లోపలికి వెళ్లి జ్యోతి ప్రజ్వలన చేసి మాల్?ను ప్రారంభించారు. పలువురు నిధి అగర్వాల్?తో సెల్ఫీ దిగడానికి పోటీ పడ్డారు. హీరోయిన్ రాక సందర్భంగా జనాల రద్దీతో ఒకవైపు ట్రాఫిక్ నిలిపివేశారు. నిజాంసాగర్ నుంచి బస్టాండ్ వైపు వెళ్లే వాహనాలను లయోల స్కూల్ ముందు రోడ్డు నుంచి మున్సిపల్ కార్యాలయం మీదుగా పోలీసులు దారి మళ్లించారు. దాంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హీరోయిన్ వెళ్లాక మధ్యాహ్నం నుంచి వాహనాల రాకపోకలు సజావుగా సాగాయి.



# ఫిర్యాదు బాక్సుల ఏర్పాటు చట్టవిరుద్ధం: టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి

కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:



నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి ఏర్పాటు చేసిన ఫిర్యాదు పెట్టెలు చట్ట విరుద్ధమని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం కలెక్టర్?ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గడ్డం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ప్రజల ఓట్లతో ఎన్నికైన ఎమ్మెల్యేను నేరుగా కలవకుండా ఫిర్యాదులను పెట్టెల ద్వారా సమర్పించేలా ప్రోత్సహిస్తున్నారన్నారు. సమస్యలను నేరుగా తెలియజేయడం ప్రజాస్వామ్యంలో పౌరుల హక్కు అని, ఫిర్యాదుల పెట్టె వంటి మధ్యవర్తిత్వ వ్యవస్థను ప్రవేశపెట్టడం పారదర్శకత, జవాబుదారీ తనాన్ని, ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యాన్ని తగ్గిస్తుందన్నారు. అంతే కాకుండా ఫిర్యాదుల పెట్టెలు అధికారిక తపాలా పెట్టెలను పోలి ఉన్నాయని గుర్తు చేశారు. ఫిర్యాదుల పెట్టెల వ్యవస్థల చట్టభద్రతలను పరిపాలన ఆమోదాలను పరిశీలించాలని, ప్రభుత్వ ఆస్తులపై ఏర్పాటు చేసిన పెట్టెలను తక్షణమే తొలగించాలని కోరారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం: కామారెడ్డిలో ‘అరైవ్ అలైవ్-2026’ అవగాహన కార్యక్రమం








**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**

రోడ్డు ప్రమాదాల వల్ల అమూల్యమైన ప్రాణాలు కోల్పోకుండా ఉండాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ప్రారంభించిన “ూతీతీఱఙవ ూశ్రీఱఙవ-2026” కార్యక్రమంలో భాగంగా సోమవారం కామారెడ్డి పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఘనంగా జరిగింది. దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గెలాక్సీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కామారెడ్డి ఏఎస్పీ బి. చైతన్య రెడ్డి, ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే వెంబడి ఉన్న దాబాలు, హోటల్స్, పంచర్ షాపుల యజమానులు, ఆటో డ్రైవర్లు మరియు సబ్ డివిజన్ పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల తీవ్రతను తగ్గించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెలలో ఒక వారం పాటు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. మన రాష్ట్రంలో ఏటా హత్యల ద్వారా సుమారు 800 మంది మరణిస్తుండగా, రోడ్డు ప్రమాదాల వల్ల సుమారు 7,500 మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత ఆందోళనకరమని పేర్కొన్నారు. ముఖ్యంగా కామారెడ్డి జిల్లాలో గత 2024 సంవత్సరంలో 275 మంది మరణించగా, పోలీసుల ముందస్తు చర్యలు మరియు నిరంతర తనిఖీల వల్ల 2025 నాటికి ఆ సంఖ్య 220కి తగ్గిందని, అంటే ఒకే సంవత్సరంలో 55 మంది ప్రాణాలను కాపాడగలిగామని వివరించారు. ఒక ప్రాణం కోల్పోవడం అంటే ఆ కుటుంబం మొత్తం ఆర్థికంగా, భావోద్వేగంగా కుప్పకూలిపోవడమేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను కఠినంగా అమలు చేయడం, అతివేగాన్ని నియంత్రించడం మరియు నిరంతర వాహన తనిఖీలు చేపట్టడం వంటి చర్యలు తీసుకుంటున్నట్లు ఏఎస్పీ వెల్లడించారు. అలాగే, ప్రమాదం జరిగిన తర్వాత మొదటి 5 నుండి 10 నిమిషాలు (గోల్డెన్ అవర్) అత్యంత కీలకమని, ఆ సమయంలో వెంటనే 108 అత్యవసర సేవలకు సమాచారం అందించాలని సూచించారు. కొన్నిసార్లు అంబులెన్స్ రావడానికి సమయం పడితే, ఆ లోపు బాధితుడికి సి పి ఆర్ చేయడం ద్వారా ప్రాణాలను నిలబెట్టవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మెడికల్ ఆఫీసర్లు మరియు నేషనల్ హైవే అథారిటీ అధికారులు సీపీఆర్ ఎలా చేయాలనే అంశంపై లైవ్ డెమో ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారితో కూడా సీపీఆర్ ప్రాక్టీస్ చేయించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి రూరల్ సీఐ రామన్, భిక్నూర్ సీఐ సంపత్, దేవునిపల్లి, రాజంపేట, దోమకొండ, మాచారెడ్డి, రామారెడ్డి ఎస్ఐలతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామం అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యే కాలే యాదయ్య కృషి ఎంతో అవసరం

## గ్రామ ఉప సర్పంచ్ వడ్ల పార్వతమ్మ రాములు

**నీలగిరి వార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవాబుపేట్ మండలం**





మండల పరిధిలోని ముబారక్ పూర్ లో పలు అభివృద్ధి పనులు జరగాలంటే ఊరి అభివృద్ధి పథంలో నడవాలి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలంటే ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆధ్వర్యంలోనే అభివృద్ధి చెందుతుందని గ్రామ ఉపసర్పంచ్ వడ్ల పార్వతమ్మ రాములు పేర్కొన్నారు నీలగిరి వార్త ప్రతినిధితో మాట్లాడుతూ ముబారక్ పూర్ లో సీసీ రోడ్లు గాని అండర్ డ్రైనేజీ గాని ఎల్ఈడి వీధి దీపాలు కానీ అదేవిధంగా గ్రామంలో ఎలాంటి అభివృద్ధి జరగాలన్న చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య సహాయ సహకారాలు ఎంతో అవసరమని అన్నారు మొన్న జరిగిన అసెంబ్లీ సమావేశాలలో చేవెళ్ల నియోజకవర్గ ప్రజలకు పనులు కనిపించాలంటే గుడిమరక్కపూర్ లో ఉన్న మార్కెట్ను అజిత్ నగర్ లో కి తీసుకువస్తే ఎందరో బీద కుటుంబాలకు పని కల్పించే వారమైతామని దాన్ని దృష్టిలో పెట్టుకొని మార్కెట్ను అజీజ్ నగర్ కు తీసుకురావాలని స్పీకర్ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి విన్నవించుకోవడం ఎంత గర్వకారణం అని అసెంబ్లీలో మాట్లాడడం జరగడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని అన్నారు. అదేవిధంగా మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న సిసి రోడ్లు మరింత అభివృద్ధి చెంది ఎక్కువ నిధులు తీసుకువచ్చి గ్రామాలను అభివృద్ధి చేయాలంటే కాలే యాదయ్య ఎమ్మెల్యే తోనే సాధ్యమన్నారు త్వరలో ముబారక్ పూర్ లో మరిన్ని నిధులు తీసుకువచ్చి ఎక్కువ అభివృద్ధి చేసే విధంగా చర్యలు చేపడతామని గ్రామ ఉపసర్పంచ్ వడ్ల పార్వతమ్మ రాములు పేర్కొన్నారు

ఇప్పటికే గ్రామ అభివృద్ధికి చేవెళ్ల శాసనసభ్యులు ఎంతో సహాయ సహకారాలు అందిస్తున్నారని గ్రామానికి భారీ నిధులు తీసుకువచ్చి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి గ్రామ సర్పంచ్ తో పాటు కార్యవర్గం పనిచేస్తాం అన్నారు. గ్రామంలో ప్రతి సమస్యను చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య దృష్టికి తీసుకువెళ్లి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# ప్రజావాణి లో 117 దరఖాస్తులు





**జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**

ప్రతీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో 117 దరఖాస్తులు వచ్చాయని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీలను అర్జీదారులు తమ సమస్యల పై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్ విక్టర్, మధుమోహన్, సీఈఓ చందర్,ఆర్డిఓ ఎన్వి గిరి లు అర్జీలను సమర్పిం చారు. ఈ సందర్భంగా ఆయా శాఖలకు సంబంధించిన వివిధ రకాల సమస్యల పై వచ్చిన అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారులకు ఇస్తూ తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ గ్రీవెన్స్ లో జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులనుద్దేశించి మాట్లాడుతూ అర్జీదారుల నుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పెండింగ్ లో లేకుండా వెంట వెంటనే పరిష్కరించాలని, పరిష్కారం కాని దరఖాస్తుల పై వివరంగా దరఖాస్తుదారునికి తెలపాలని అన్నారు. ఈ ప్రజావాణి లో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో ప్రజావాణి కార్యక్రమం

**సైబరాబాద్ నీలగిరి వార్త**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) కమిషనర్ , అన్ని విభాగాల హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్స్ (హెచ్ వో డి ) ల తో కలిసి, సోమవారం సిఎంసి ప్రధాన కార్యాలయం (నాక్ భవనం)లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పౌరుల నుంచి మొత్తం 39 వినతిపత్రాలు స్వీకరించబడినవి. అందులో ప్రధానంగా పారిశుధ్యం, డ్రైనేజ్, రోడ్లు, వీధి దీపాలు, టౌన్ ప్లానింగ్ , ఇతర పౌర సమస్యలకు సంబంధించిన వినతులు ఉన్నాయి. కమిషనర్ అందిన ప్రతి వినతిపత్రాన్ని సంబంధిత విభాగాధిపతులకు అప్పగించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్దిష్ట గడువులోగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో సిఎంసి అధికారులు, సిబ్బంది , పౌరులు పాల్గొన్నారు.




# వనస్థలిపురంలో ఇమ్మిట్రిక్స్ స్టడీ అబ్రాడ్ కన్సల్టెన్సీ ఘనంగా ప్రారంభం


**విద్య,ఉద్యోగం,వ్యాపార వంటి వాటికి ఇమ్మిట్రిక్స్ అద్భుత సేవలందిస్తుంది**

**దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్**

**పేద విద్యార్థిని విద్యార్థులకు 10 లక్షలకే విదేశాల్లో విద్య మా యొక్క ముఖ్య ఉద్దేశం**

**ఇమ్మిట్రిక్స్ కన్సల్టెన్సీ ఎండి జయంత్ రెడ్డి**

**వనస్థలిపురం, నీలగిరి వార్త (మార్చి30):**



వనస్థలిపురంలోని పనామా గోడౌన్స్ సమీపంలో జీవన్ సాయి హాస్పిటల్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన ఇమ్మిట్రిక్స్ స్టడీ అబ్రాడ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ హాజరై యజమాని జయంత్ రెడ్డి, నిర్వాహకులు నవీన్ తో కలిసి సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ..విదేశీ విద్య, ఉద్యోగాల కోసం ప్రయత్నించేవారికి, వ్యాపారాలు చేసుకునే వారికి ఇమ్మిట్రిక్స్ ఓవర్సీస్ కన్సల్టెన్సీ అద్భుత సేవలందిస్తుందని కొనియాడారు. పేద విద్యార్థులకు తక్కువ ఖర్చుతో విదేశాలకు వెళ్లే వెసులుబాటు కల్పించాలని సూచించారు. అనంతరం నిర్వాహకులు జయంత్ రెడ్డి నవీన్ లు మాట్లాడుతూ.. తమ ఇమ్మిట్రిక్స్ స్టడీ అబ్రాడ్ కన్సల్టెన్సీ 6వ బ్రాంచ్ ని వనస్థలిపురంలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. విదేశాల్లో చదువు, ఉద్యోగాల కోసం ప్రయత్నించేవారు చాలా జాగ్రత్తగా ప్రణాళిక వేసుకోవాలని ఎవరెవరినో నమ్మి వీసాల కోసం డబ్బులు వెచ్చించి మోసపోవద్దని తమ లాంటి గుర్తింపు ఉన్న కన్సల్టెన్సీలను మాత్రమే సంప్రదించాలని సూచించారు. బీటెక్ విద్యార్థులు వై యాక్సిస్ కన్సల్టెంట్ ద్వారా శిక్షణ పొందితే భవిష్యత్తులో ఎక్కడకు వెళ్లాలన్న దగ్గరుండి సహకరిస్తామని తెలిపారు. తమ కన్సల్టెన్సీ ద్వారా విద్యార్థిని విద్యార్థులకు 10 లక్షలకే విదేశీ విద్యను అభ్యసించవచ్చని అంతేకాకుండా విదేశాల్లో చదువుకునేటప్పుడు పార్ట్ టైం జాబ్, అకామిడేషన్ ని కూడా ఏర్పాటు చేస్తామని విదేశీ విద్యకు అవసరమైన లోని కూడా తామే సమకూరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం అశోక్ గౌడ్, హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేంది శశిధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మెరుగు రమేష్ రెడ్డి, సాయి కిరణ్ గౌడ్ ,స్థానిక నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# 10వ తరగతి పరీక్షలు పూర్తి అయ్యేంత వరకు టీచర్లు వసతి గృహాల్లోనే ఉండాలి

## - జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ


**తాండూర్ ,మార్చి 30 నీలగిరి వార్త :**

10వ తరగతి పరీక్షలు పూర్తి అయ్యేంత వరకు సబ్జెక్ట్ టీచర్లు వసతి గృహాల్లోనే ఉండాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. సోమవారం రాత్రి యాలాల్ మండలం కోకట్ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భౌతిక శాస్త్రం ( ఫిజిక్స్ ) సబ్జెక్టుపై విద్యార్థినీల నైపుణ్యాన్ని స్వయంగా ప్రశ్నలకు సమాధానాలను బోర్డుపై రాయించి తేలుకున్నారు. సబ్జెక్టు పైన ఏవైనా సందేహాలు ఉంటే టీచర్లను అడిగి నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ విద్యార్థినిలకు సూచించారు. ఈ సందర్భంగా మెనూ చార్ట్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఈ రోజు అందించిన టిఫిన్, భోజన వివరాలను అడిగి తీసుకున్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని విద్యార్థినీలకు అందించాలని కలెక్టర్ ప్రిన్సిపాల్ కు సూచించారు. కలెక్టర్ తో పాటు ఆర్డిఓ కె.అనిత, తహసిల్దార్ తారా సింగ్, ప్రిన్సిపాల్ సరస్వతి, టీచర్లు వున్నారు.



# సితార ఎంటర్‌టైనర్‌లో నితిన్

చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న టాలీవుడ్ యంగ్ హీరోల్లో ఒకరు నితిన్. హిట్టు, ఫ్లాపులతో సంబంధం లేకుండా సినిమాలు చేస్తున్న నితిన్ తాజాగా కొత్త ప్రాజెక్టును రివీల్ చేశాడు. సోమవారం నితిన్ కు పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ ఈ కొత్త సినిమాను ప్రకటించారు. టాలీవుడ్ లీడింగ్ ప్రొడ్యూసర్ సూర్య దేవర నాగవంశీ సితార ఎంటర్‌టైన్ మెంట్స్‌పై ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ప్రొడక్షన్ నంబర్ 43గా రాబోతున్న ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేయబోయేది ఎవరనేది క్లారిటీ రావాల్సి ఉంది. స్టైలిష్ లుక్‌లో ఉన్న నితిన్ తాజా స్టిల్‌లో కనిపిస్తుండగా.. ఇంతకీ ఈ మూవీ ఎలాంటి స్టోరీతో రాబోతుంది. హీరోయిన్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎవరనే దానిపై రానున్న రోజుల్లో క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్. నితిన్ నటించిన ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్, రాబిన్ హుడ్, తమ్ముడు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మూవీ లవర్స్‌ను నిరాశపరిచాయి. ఈ నేపథ్యంలో ఈ సారి ఎలాగైనా మంచి హిట్ కొట్టాలని చూస్తున్నాడు నితిన్. మరి నితిన్‌కు ఈ సినిమానైనా కలిసొస్తుందేమో చూడాలంటున్నారు మూవీ లవర్స్.




# ఓటిటిలోకి సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని

శివాజీ, లయ, రోహన్ నటించిన తాజా చిత్రం సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని. మార్చిలో థియేటర్‌లో విడుదలై నవ్వులు పంచిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ఏప్రిల్ 3 నుంచి నెట్‌ప్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. సుధీర్ శ్రీరామ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అలీ, ధనరాజ్, ఇమ్మాన్యుయేల్ నవ్వులు పూయించారు. శ్రీరామ్ (శివాజీ) నిజాయతీపరుడైన పంచాయతీ కార్యదర్శి. కొత్తకోట సమీపంలోని హార్స్‌లీహిల్స్‌లో భార్య ఉత్తర (లయ), కొడుకు బిట్టు అలియాస్ నితిన్ (రోహన్)తో కలిసి జీవిస్తుంటాడు. ఓ దీపావళి రోజున వాళ్ల ఇంటికి ఆ ఊరి ఎస్సై విక్రమ్ వాసుదేవ్ (ప్రిన్స్) వస్తాడు. అతనికి ఆడవాళ్ల పిచ్చి. అప్పటికే శ్రీరామ్‌తో ఓసారి గొడవ జరుగుతుంది. దీంతో అతనిపై పగ పెంచుకున్న విక్రమ్.. ఇంట్లో తను లేదని తెలిసి ఉత్తరపై అఘాయిత్యానికి ప్రయత్నిసాడు. కట్ చేస్తే.. అనూహ్యంగా శ్రీరామ్ కొడుకు చేతిలో ఆ ఎస్సై హత్యకు గురవుతాడు. మరి ఆ తర్వాత ఏమైంది? ఆ హత్య కేసు నుంచి తన కుటుంబాన్ని కాపాడుకునేందుకు శ్రీరామ్ ఏం చేశాడు? రూ.కోటి డబ్బుతో ఉన్న తన గిఫ్ట్ బ్యాగ్ ఎత్తుకెళ్లారంటూ స్థానిక ఎమ్మెల్యే తిమ్మప్ప (శరత్ లోహితాశ్వ) గ్యాంగ్ శ్రీరామ్ వెంట పడటానికి కారణమేంటి? ఈ మొత్తం కథకు కానిస్టేబుల్ సుధీర్ (ధనరాజ్)కు ఉన్న సంబంధం ఏంటి? అన్నది చిత్ర కథ.




# సల్మాన్‌తో వంశీ పైడిపల్లి మూవీ

**బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్‌తోవంశీ పైడిపల్లి సినిమా చేయనున్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తోన్న**

విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన వెలువడింది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై ఇది రానున్నట్లు తెలుపుతూ ఓ ఫొటో షేర్ చేసింది. ఏప్రిల్ నుంచి దీని షూటింగ్ ప్రారంభం కానున్నట్లు వెల్లడించింది. ఇందులో హీరోయిన్‌గా నయనతారను ఎంపిక చేసినట్లు కూడా ఇటీవల వార్తలు వచ్చాయి. బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్‌కపూర్ ఓ కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. త్వరలోనే నటీనటుల వివరాలు పంచుకోనున్నారు. 2027లో దీన్ని విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సల్మాన్ ఖాన్ 'మాతృభూమి'లో నటిస్తున్నారు. దీనితోపాటే వంశీ సినిమాను కూడా మొదలు పెట్టనున్నట్లు తెలుస్తోంది. భారీస్థాయిలో దీన్ని తెరకెక్కించనున్నారు. నిజానికి సల్మాన్‌కు మంచి హిట్ పడి చాలాకాలం అయింది. మరోవైపు వంశీ కూడా చివరిగా విజయ్ హీరోగా 'వారసుడు' రూపొందించారు. అది అనుకున్న స్థాయిలో అంచనాలను అందుకోలేకపోయింది. అప్పటినుంచి సల్మాన్ ప్రాజెక్ట్ పైనే వర్క్ చేశారు. దీంతో ఈ ప్రాజెక్ట్ ఇద్దరికీ కీలకంగా మారింది.



# చిరుతో మరోమారు బాబీ సినిమా

మన శంకర వరప్రసాద్ గారు అనే చిత్రంతో మంచి హిట్ కొట్టిన చిరంజీవి ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌తో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రం తన కెరీర్‌లో 158వ చిత్రంగా రూపొందుతుంది. ఈ చిత్రాన్ని గతంలో 'వాల్తేరు వీరయ్య'తో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ సృష్టించిన దర్శకుడు కేఎస్ రవీంద్ర (బాబీ) తెరకెక్కిస్తున్నారు. ఈ హిట్ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. 'వాల్తేరు వీరయ్య' తర్వాత బాబీ మెగాస్టార్‌ను మరింత పవర్‌ఫుల్‌గా చూపించబోతున్నారని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.తాజా సమాచారం ప్రకారం, ఈ క్రేజీ ప్రాజెక్ట్ రెగ్యులర్ షూటింగ్ ఏప్రిల్ 20, 2026 నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే ప్రీ-ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. బెంగాల్ బ్యాక్‌డ్రాప్‌లో తండ్రీకూతుళ్ల భావోద్వేగాలతో కూడిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ కథను రూపొందించినట్లు సమాచారం. ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. టాలీవుడ్ మాత్రమే కాకుండా ఇతర ఇండస్ట్రీల నుంచి కూడా ప్రముఖ నటులను ఎంపిక చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.సినిమా కాస్టింగ్ విషయంలో కూడా ఆసక్తికర విషయాలు బయటకు వస్తున్నాయి. మెగాస్టార్‌కు భార్య పాత్రలో నేషనల్ అవార్డ్ విన్నర్ ప్రియమణి నటించనున్నట్లు తెలుస్తోంది. కూతురు పాత్రలో 'కన్నప్ప' ఫేమ్ ప్రీతి ముకుందన్ ఎంపికైనట్లు సమాచారం.



# ప్రకాశ్‌రాజ్‌కు మాతృవియోగం

## సంతాపం ప్రకటించిన పవన్

విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన మాతృమూర్తి సువర్ణలత (86) సోమవారం ఉదయం బెంగళూరులోని స్వగృహంలో కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో గత కొంతకాలంగా బాధపడుతున్న ఆమె ఆరోగ్యం విషమించడంతో తుది శ్వాస విడిచారు. తల్లితో ఎంతో ఆత్మీయ అనుబంధం కలిగిన ప్రకాశ్ రాజ్, షూటింగ్‌లతో బిజీగా ఉన్నప్పటికీ తరచూ ఆమెను పరామర్శించేవారు. మరణవార్త తెలియగానే వెంటనే బెంగళూరుకు చేరుకున్న ఆయన, కుటుంబ సభ్యులతో కలిసి అంత్యక్రియల ఏర్పాట్లలో పాల్గొన్నారు. ఈ విషాద ఘటనపై పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ, 'ప్రకాశ్ రాజ్ గారి మాతృమూర్తి సువర్ణలత గారి మరణ వార్త తెలిసి తీవ్రంగా విచారించాను. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను. ఈ దుఃఖ సమయంలో ప్రకాశ్ రాజ్ గారికి, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అని పేర్కొన్నారు. ప్రకాశ్ రాజ్ కుటుంబం ఈ విషాదాన్ని ధైర్యంగా ఎదుర్కొనాలని సినీ వర్గాలు, అభిమానులు కోరుకుంటున్నారు.



# రూ.1,365 కోట్లు సాధించిన 'ధురంధర్ 2'..

## దరుంధర్ చూసి పాఠాలు నేర్చుకోవాలన్న ఆర్జీవి

రణ్‌వీర్ సింగ్ హీరోగా తెరకెక్కిన దురంధర-2 చిత్రం తొలిరోజు నుంచే వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ఇప్పటివరకూ ప్రపంచవ్యాప్తంగా రూ.1,365 కోట్లు తన ఖాతాలో వేసుకుంది. దీంతో మొదటిభాగం ఆల్‌టైమ్ కలెక్షన్ల రూ.1,307 కోట్లును ఈ సీక్వెల్ కేవలం 11 రోజుల్లోనే దాటేసింది. ఇకపోతే ఉలవురు ప్రముఖులు ఈ చిత్రాన్ని ప్రశంసిస్తూనే ఉన్నారు. తాజాగా దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి సోషల్ మీడియా వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదిత్య ధర్ తెరకెక్కించిన తాజా చిత్రం 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద సృష్టిస్తోన్న ప్రభంజనంపై స్పందిస్తూ.. చిత్ర పరిశ్రమలోని ప్రముఖుల మౌనాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ సినిమా సాధించిన విజయం ఒక 'అణుబాంబు' లాంటిదని ఆయన అన్నారు. ఆదిత్య ధర్ చిత్ర పరిశ్రమ కింద ఒక అణుబాంబును పేల్చారు. కానీ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. మిగిలిన చిత్ర పరిశ్రమ అంతా మౌనం పాటిస్తోంది. 'ధురంధర్ 2' పేలుడు ధాటికి అందరూ అంతరిక్షంలోకి వెళ్లారేమో.. అందుకే వారి చప్పట్లు ఇక్కడికి వినిపించడం లేదు. బహుశా వారంతా ఇది కేవలం ప్రచారమే అని, త్వరలోనే తగ్గిపోతుందని తమలో తాము గుసగుసలాడుకుంటున్నారేమో. అలా అనుకుంటూ మళ్లీ పాత కాలపు మూస సినిమాలను తీయాలని చూస్తున్నారు. లేదా ఈ సినిమా అద్భుతమైన విజయాన్ని చూసి, తాము తీస్తున్న సినిమాలు దీని ముందు నిలవలేవని అనుకొని మౌనంగా ఉంటున్నారేమో అంటూ వ్యాఖ్యానించారు.

కళ్ళెదుట డైనోసార్ లాంటి సినిమా నిలబడి నిప్పులు కురిపిస్తుంటే, దాని బాక్సాఫీస్ గర్జనతో భూమి కంపిస్తుంటే.. కళ్లు మూసుకోవడం సరైన పద్ధతి కాదు. నా సహచరులందరికీ నేను ఇచ్చే సలహా ఒక్కటే.. 'ధురంధర్ 2' సినిమాను ఒక పాఠంలా చదవండి. దీన్ని చూసి మీ చిత్రాల్లో మార్పులు చేసుకోండి' అని ఆర్జీవీ సలహా ఇచ్చారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

